RNI No. APTEL/2009/28868

# సిటిజన్ టైమ్స్

ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం

తెలుగు దినపత్రిక

CITIZEN TIMES TELUGU DAILY

సంపుటి :18 | సంచిక : 300 | సంపాదకులు : కంచర్ల సందీప్ కుమార్ | ప్రచురణ : విశాఖపట్నం | 5-9- 2026 | పేజీలు : 8 | వెల : 2/- రూ ॥

VOLUME: 18 | ISSUE : 300 | EDITOR:KANCHERLA SANDEEP KUMAR | PUBLISHED: VISAKHAPATNAM | 5-9-2026 | PAGES: 8 | PRICE : 2/- RS



## రాజమండ్రిలో సగం కాలుష్యానికి కారణం ఇదే

పుష్కర కాలంగా పన్నులు ఎగవేస్తున్న ఆంధ్ర పేపర్ మిల్లు

రాజమండ్రి కాలుష్యంలో సగం ఆ పరిశ్రమ వల్లేనన్న పవన్

పద్ధతి మార్చుకోకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

కోర్టు కేసులను వేగవంతం చేయాలని న్యాయవాదులకు ఆదేశాలు

స్వచ్ఛ గోదావరి లక్ష్యంగా ముందుకెళతామన్న ప్రభుత్వం



**అమరావతి, సిటిజన్ టైమ్స్**

రాజమండ్రిలోని ఆంధ్ర పేపర్ లిమిటెడ్ (ఏపీఎల్) తీరుపై రాష్ట్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పుష్కర కాలంగా పన్నులు ఎగవేస్తూ, మరోవైపు గోదావరి నదిని తీవ్రంగా కలుషితం చేస్తూ బాధ్యతా రహితంగా వ్యవహరిస్తోందని ఆయన విరుచుకుపడ్డారు. రాజమండ్రిలో సగం కాలుష్యానికి ఈ కంపెనీయే కారణమని ఆరోపించారు. పద్ధతి మార్చుకోకపోతే పరిశ్రమ కార్యకలాపాలను నిలిపివేయడం దగ్గర నుంచి లైసెన్సు రద్దు వరకు ఎలాంటి కఠిన చర్యలకైనా వెనుకాడబోమని స్పష్టం చేశారు. ఈ మేరకు కంపెనీకి షోకాజ్ నోటీసులు జారీ చేసి, తక్షణమే చర్యలు చేపట్టాలని కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) అధికారులను ఆదేశించారు.

**పుష్కర కాలంగా పన్ను ఎగవేత**

2016 నుంచి కాటేరు గ్రామ పంచాయతీకి గానీ, రాజమండ్రి నగరపాలక సంస్థకు గానీ ఆంధ్ర పేపర్ మిల్లు ఒక్క రూపాయి కూడా పన్ను చెల్లించలేదని పవన్ కల్యాణ్ ఆరోపించారు. స్థానిక సంస్థలకు సుమారు రూ. 21.34


తరువాయి 2లో..

## ఉద్యోగ, ఉపాధ్యాయ నేతలతో చంద్రబాబు రేపు కీలక భేటీ

పీఆర్సీ, కరవు భత్యం తదితర అంశాలపై చర్చించనున్న సీఎం

నిన్న చంద్రబాబును కలిసిన ఏపీ జేఏసీ నేతలు

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్న ముఖ్యమంత్రి



**అమరావతి, సిటిజన్ టైమ్స్**

ఆంధ్రప్రదేశ్‌లోని ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు సంబంధించిన దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేసింది. ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో రేపు జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లోని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. కొత్త పే రివిజన్ కమిషన్ (పీఆర్సీ) ఏర్పాటు, పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ

తరువాయి 2లో..

## కేరళలో నారా లోకేశ్.. అమృతపురిలో 'అమ్మ' ఆశీర్వాదం...

కేరళలో పర్యటించిన మంత్రి నారా లోకేశ్

కొల్లం జిల్లాలోని అమృతపురి ఆశ్రమం సందర్శన

మాతా అమృతానందమయి ఆశీస్సులు అందుకున్న లోకేశ్

ఆశ్రమంలోని అమృత విశ్వ విద్యాపీఠాన్ని పరిశీలించిన వైనం

ఈ పర్యటన వ్యక్తిగతమని, అధికారికం కాదని సమాచారం



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శుక్రవారం కేరళలో పర్యటించారు. కొల్లం జిల్లాలోని ప్రఖ్యాత

తరువాయి 2లో..



## ఆ సన్నని గొంతే ఆశలు నింపి.. నేపాల్ టన్నెల్ ఆపరేషన్‌లో అద్భుతం!

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

నేపాల్ విలయంలో గల్లంతైన తమవారు బతికి వస్తారనే ఆశలు సన్నగిల్లుతోన్న వేళ ఓ అద్భుతం జరిగింది. 9 రోజులుగా ఎదురుచూసి.. కొందరి కర్మకాండలు కూడా చేస్తున్న సమయంలో టన్నెల్ నుంచి ఇద్దరు సజీవంగా బయటపడటం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది (చీవజ్ఝుశ్రీ ుబఅఅవశ్రీ =వంఎబవ). భోటెకోషి నది ఉప్పొంగడంతో 60 మెగావాట్ల హైడ్రో పవర్ ప్రాజెక్ట్ పూర్తిగా దెబ్బతినగా.. పలువురు సిబ్బంది త్రిశూలి 3ఏ టన్నెల్‌లో చిక్కుకుపోయారు. అలా కొట్టుకుపోయిన వారి సంఖ్య 42గా తెలుస్తోంది. తాజాగా సహాయ సిబ్బంది ఇద్దరిని రక్షించడంతో మిగిలిన

తరువాయి 2లో..



## ఎడిటోరియల్

### జగన్ పాదయాత్ర.. బ్లాస్టింగ్ న్యూస్ అదేనా ?

వైసీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాదయాత్ర చేస్తాను అని గత కొంతకాలంగా చెబుతూ వస్తున్నారు. పార్టీ నేతలు కూడా ఇదే మాట అంటున్నారు. ఏ ఏడాది అంటే 2027 అన్నది తెలిసింది. కానీ ఏ నెల ఏ డేటూ అన్నది ఇప్పటి వరకూ ఎవరికీ తెలియదు. కానీ ఇపుడు ఒక బ్లాస్టింగ్ న్యూస్ బయటకు వచ్చింది. జగన్ పాదయాత్ర డేట్ మంత్ కూడా చెబుతూ ఈ న్యూస్ ఇపుడు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. జగన్ తన తండ్రి వైఎస్సార్ 78వ జయంతి వేళ ఆ రోజు నుంచే పాదయాత్రకు శ్రీకారం చుడతారు అని అంటున్నారు. అంటే 2027 జూలై 8 నుంచి అన్న మాట. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారు తన తండ్రి జయంతి రోజైన ఆ రోజే తన పాదయాత్రను ప్రారంభించాలని యోచిస్తున్నట్లు వస్తున్న వార్తలు రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. గతంలో కూడా ఆయన ఇదే వ్యూహంతో ప్రజల్లోకి వెళ్లిన సంగతి తెలిసిందే. సరిగ్గా అంతకు పదేళ్ళ క్రితం 2017 నవంబర్ 6 నుంచి జగన్ పాదయాత్ర ప్రారంభించారు. ఈసారి కూడా చివరిలో 7 ఉన్న ఏడాదితోనే మొదలెడుతున్నారు అని అంటున్నారు. ఇదిలా ఉంటే జగన్ ఎప్పటి నుంచి పాదయాత్ర ఏపీలో మొదలెడతారు అన్నది నేషనల్ మీడియా ఇండో-ఏషియన్ న్యూస్ సర్వీస్ వెల్లడించింది. ఈ సంస్థ పేర్కొన్న దాని ప్రకారం చూస్తే జగన్ 2027 జూలై 8 ముహూర్తం పెట్టుకున్నారు అని స్పష్టం చేసింది. ఇది కూడా పార్టీ వర్గాలు చెప్పినట్లుగా పేర్కొనడం విశేషం. మరి ఇది నిజమేనా ఈ డేట్ కచ్చితంగా జగన్ పాదయాత్రకు నాంది పలుకుతుందా అంటే తెలియాలంటే ఇంకా పది నెలల సమయం ఉంది. ఇక ఈ న్యూస్ నిజమా కాదా అన్నది పక్కన పెడితే జగన్ పాదయాత్రకు సంబంధించి వచ్చిన ఈ వార్త అయితే వైసీపీ వర్గాలలో పెద్ద ఎత్తున ఉత్సాహాన్ని కలిగిస్తోంది అంటున్నారు. ఈ ఏడాది గడిస్తే చాలు జగన్ జనంలోకి వస్తారు, ఏకంగా పాదయాత్రతో అందరితో కలసి అడుగులు వేస్తారు అని వైసీపీ వర్గాలలో చర్చ సాగుతోంది. జాతకం ప్రకారమేనా : మరో వైపు చూస్తే జగన్ జాతకం ప్రకారం నవంబర్ 9 వరకూ పెద్దగా ఆశించిన ఫలితాలు ఉండవని అంటున్నారు. ఆ తరువాత ఒక్కసారిగా ఆయన జాతకం మారుతుందని ఆయనకు రాజకీయంగా అనుకూలమైన వాతావరణం ఏర్పడుతుందని అంటున్నారు. అందుకే ఈ ఏడాది చివరి నుంచే జిల్లాల పర్యటనలు వంటివి ప్రారంభించి వాటిని ఒక పద్ధతిలో నిర్వహించుకున్నాక 2027 జూలై 8 నుంచి జగన్ పాదయాత్ర ప్రారంభిస్తారు అని అంటున్నారు. రాజకీయాల్లో పోయిన చోటనే వెతుక్కోవాలి అని అంటారు. జగన్ కూడా అదే పని చేస్తున్నారు. తన రాజకీయ జీవితంలో 2017లో అతి పెద్ద పాదయాత్రను నిర్వహించి 2019లో అధికారాన్ని అందుకున్న ఆయన మరోసారి భారీ పాదయాత్రకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. అలా జగన్ తన సుదీర్ఘ రాజకీయ పాదయాత్రను ప్రజా సమస్యలను తెలుసుకోవడానికి క్యాడర్‌లో ఉత్సాహాన్ని నింపడానికి వ్యూహాత్మకంగా ప్లాన్ చేశారు. అదే సమయంలో 2029 లో కచ్చితంగా అధికారం అందుకోవడానికే అని కూడా అంటున్నారు. అయితే ప్రస్తుత రాజకీయ పరిణామాలు చూస్తే కనుక పాదయాత్ర షెడ్యూల్ ఫిక్స్ చేయడానికి ఇంకా చాలా సమయం పడుతుందని అంటున్నారు. అంతవరకూ వస్తున్నవి ఊహాగానాలేనా అంటే వైసీపీ అధికారికంగా ప్రకటించేవరకూ అలాగే అనుకోవాలని అంటున్నారు.

# రాజమండ్రిలో సగం కాలుష్యానికి కారణం ఇదే

కోట్ల మేర పన్నులు బకాయిపడిందని ఆయన తెలిపారు. పన్ను చెల్లించాలని అధికారులు నోటీసులు జారీ చేసిన ప్రతిసారీ, యాజమాన్యం కోర్టులను ఆశ్రయించి జాప్యం చేస్తోందని, బాధ్యత నుంచి తప్పించుకుంటోందని మండిపడ్డారు. ప్రభుత్వంతో సంబంధం లేకుండా సొంతంగా పన్ను మినహాయింపు ఇచ్చుకున్నారా? అని ఆయన నిలదీశారు.

**గోదావరిని కమ్మేస్తున్న కాలుష్యం**

అధికారిక గణాంకాల ప్రకారమే రాజమండ్రి నగరంలోని మొత్తం కాలుష్యంలో సగం ఆంధ్ర పేపర్ మిల్లు నుంచే వస్తోందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. నగరం మొత్తం మీద రోజుకు 70 మిలియన్ లీటర్ల ద్రవ వ్యర్థాలు ఉత్పత్తి అయితే, ఒక్క ఆంధ్ర పేపర్ మిల్లు నుంచే 35 మిలియన్ లీటర్ల వ్యర్థాలు వెలువడుతున్నాయని వివరించారు. ఈ వ్యర్థ జలాల్లో ప్రమాదకర రసాయనాలు నిర్దేశిత పరిమితికి మించి ఉన్నాయని పరీక్షల్లో తేలిందన్నారు. లాగూన్ల వద్ద సేకరించిన నీటి నమూనాల్లో బయోకెమికల్ ఆక్సిజన్ డిమాండ్ (బీఓడీ) లీటరుకు 36 మిల్లీగ్రాములుగా ఉందని, ఇది ప్రమాణాల కన్నా 20 శాతం అధికమని తెలిపారు. అదేవిధంగా ఫాస్ఫేట్ 6 శాతం, సల్ఫైడ్‌లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రమాణాల కన్నా ఏకంగా 70 శాతం అధికంగా ఉన్నాయని ఆయన వెల్లడించారు.

**పర్యావరణం, ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం**

పరిశ్రమ విడుదల చేస్తున్న కాలుష్యం వల్ల గోదావరి నీటిలో ఆక్సిజన్ స్థాయిలు తగ్గి జలచరాల మనుగడకు ముప్పు వాటిల్లుతోందని, నది సహజ పర్యావరణ వ్యవస్థ దెబ్బతింటోందని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. దుర్వాసన, నీటి నాణ్యత క్షీణతతో ప్రజారోగ్యానికి హాని కలుగుతోందని, భవిష్యత్ తరాల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోందని అన్నారు. గతంలో తాను క్షేత్రస్థాయిలో పర్యటించినప్పుడు భూగర్భ జలాలు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించినా, యాజమాన్యం పట్టించుకోలేదని గుర్తుచేశారు.

**ఇక ఉపేక్షించేది లేదు..**

నిబంధనలు ఉల్లంఘిస్తున్నందున పరిశ్రమ కార్యకలాపాలను నిలిపివేయడం, జరిమానాలు విధించడం, కంపెనీని సీజ్ చేయడం, లైసెన్సును రద్దు చేయడం వంటి కఠిన చర్యలు తీసుకునే అధికారం ప్రభుత్వానికి ఉందని పవన్ కల్యాణ్ హెచ్చరించారు. అయితే, పరిశ్రమలను ఇబ్బంది పెట్టకూడదనే ఉద్దేశంతోనే సంకీర్ణ ప్రభుత్వం ముందుగా షోకాజ్ నోటీసులు జారీ చేసి, తప్పు సరిదిద్దుకునే అవకాశం ఇచ్చిందని తెలిపారు. గత మూడు నెలలుగా పీసీబీ అధికారులు సంస్థ ప్రతినిధులతో పలుమార్లు చర్చించినా స్పందన కరువైందని అన్నారు. ఈ నేపథ్యంలో తక్షణమే సమన్లు జారీ చేసి, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇలాంటి కేసుల విచారణను వేగవంతం చేసేలా చూడాలని అడ్వకేట్ జనరల్, అదనపు ఏజీ, ఇతర ప్రభుత్వ న్యాయవాదులకు సూచించారు. 'స్వచ్ఛ గోదావరి - పవిత్ర పుష్కరాలు' నినాదంతో గోదావరి పరిరక్షణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు పర్యావరణవేత్తలు, పౌర సమాజం మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. ప్రజల ప్రయోజనాలు, పర్యావరణ పరిరక్షణకే తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

# క్రెడిట్ పిచ్చితో జగన్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు

### తన ఆత్మవంచనపై జగన్ -ఆత్మపరిశీలన చేసుకోవాలి: ప్రత్తిపాటి

**చిలకలూరిపేట : (సిటిజన్ టైమ్స్):సెప్టెంబర్ :04;**

పలనాడు జిల్లా, చిలకలూరిపేట నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూతన ఆత్మవంచనపై జగన్ ఆత్మపరిశీలన చేసుకోవాలి. నీళ్లు లేకుండా సాగునీటి ప్రాజెక్టుల్ని జాతికి అంకితం చేయడం.. సెట్టింగులు వేసి రైతుల్ని మోసగించడంలో జగన్ సమర్థుడని ప్రజలకు బాగా తెలుసు. అలాంటి నాయకుడు కూటమిప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మంచిని గుర్తించకుండా నిజాల్ని వక్రీకరిస్తూ, ముఖ్యమంత్రి చంద్రబాబును నిందించడాన్ని ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో సమర్థించరు. రాష్ట్రప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు, సమృద్ధిగా సాగునీరు అందించాలన్న చంద్రబాబు సంకల్పబలం ముందు జగన్ విషప్రచారం నిలవదు. చంద్రబాబు దూరదృష్టి, పట్టుదల, నిర్విరామ కృషి వల్లే మొన్న వెలిగొండకు కృష్ణా జలాలు, నిన్న అనకాపల్లికి గోదావరి నీళ్లు వచ్చాయన్నది ప్రజలెరిగిన సత్యం. అవినీతి, దోపిడీలు తప్ప రాష్ట్రానికి, తమకు జగన్ ఎప్పటికీ మంచి చేయడని, అసలు కలలో కూడా జగన్ కు ఆ ఆలోచన రాదని ప్రజల గట్టి నమ్మకం. ఇతరుల విజయాల్ని తనవిగా చెప్పుకున్నంతకాలం ప్రజల దృష్టిలో జగన్ ఎప్పటికీ అసమర్థుడిగానే మిగిపోతాడు. తన హాయాంలో .. తన తండ్రి హాయాంలో ముఖ్యమైన పనులు జరిగాయని అవినీతి పత్రికలో దుష్ప్రచారం తప్ప, ఆధారాలతో కూడిన వాస్తవాల్ని జగన్ ఎందుకు ప్రజల ముందు ఉంచడం లేదు? నిధుల కేటాయింపులు లేకుండా.. క్షేత్రస్థాయిలో పనుల పురోగతి



కనిపించకుండా, భూములిచ్చిన నిర్వాసితులకు న్యాయం చేయకుండా అంతా తామే చేశామంటున్న జగన్ అజ్ఞానాన్ని ప్రజలు అసహ్యించుకుంటున్నారు. ఎవరి కాలంలో పనులు జరిగాయో..ఎవరి పాలనలో నీళ్లువచ్చాయో ప్రజలకు తెలియదా? క్రిమినల్ నాలెడ్జ్ , క్రెడిటి పిచ్చితో ప్రజల్ని తప్పుదోవ పట్టించి, రాజకీయలబ్ధి పొందాలన్నదే జగన్ ఎత్తుగడ. ఆయన..వైసీపీనేతలు మున్ముందు ఇదే పంథాను కొనసాగిస్తే వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీఖాతాలో సున్నాశాతం ఓట్లే క్రెడిట్ చేస్తారు." అని ప్రత్తిపాటి గురువారం ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు.

# ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

### వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

### శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే



**విజయవాడ: (సిటిజన్ టైమ్స్): సెప్టెంబర్; 04;**

మంచిని కాపాడేందుకు, చెడును అంతం చేసేందుకు శ్రీకృష్ణ పరమాత్ముడు అవతరించారని ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. విజయవాడ రూరల్ మండలంలోని ప్రసాదంపాడు గ్రామంలో యాదవ్ యూత్, రామవరప్పాడు గ్రామంలో యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వివిధ రకాల పుష్పాలతో శ్రీకృష్ణుని విగ్రహాలను సర్వాంగ సుందరంగా అలంకరించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో శ్రీకృష్ణ పరమాత్మను దర్శించుకున్న ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ మహావిష్ణువు ఎనిమిదో అవతారమైన శ్రీకృష్ణావతారం ధర్మ పరిరక్షణకు ప్రతీకగా నిలిచిందన్నారు. అధర్మం పెరిగిన ప్రతిసారీ దైవం అవతరించి ధర్మాన్ని స్థాపిస్తుందనే సందేశాన్ని శ్రీకృష్ణుని జీవితం ప్రపంచానికి చాటిందని చెప్పారు. ప్రపంచానికి భగవద్గీతను బోధించి కర్తవ్యాన్ని, ప్రేమ తత్వాన్ని, ధర్మ మార్గాన్ని చూపిన మహనీయుడు శ్రీకృష్ణుడని కొనియాడారు. ఎక్కడ శ్రీకృష్ణుని నామస్మరణ ఉంటుందో అక్కడ ఆనందం, శాంతి, సౌభాగ్యం నెలకొంటాయని, పిల్లల సందడితో ఆధ్యాత్మిక వాతావరణం కళకళలాడుతుందని పేర్కొన్నారు. శ్రీకృష్ణుని కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబంలో ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, యాదవ సంఘాల ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో మెరుగైన రహదారి వ్యవస్థ అత్యంత కీలకం

**ఆలమూరు: (సిటిజన్ టైమ్స్): సెప్టెంబర్; 04:**

డాక్టర్అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గం లోగ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో మెరుగైన రహదారి వ్యవస్థ అత్యంత కీలకమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుదలకు రహదారులు తోడ్పడతాయని తెలిపారు. శుక్రవారం ఆయన నియోజకవర్గంలోని దేవరపల్లి, ఆలమూరు గ్రామాల్లో రూ.1.50కోట్ల సాస్కీ నిధులతో చేపట్టిన రెండు బీటీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. తొలుత రూ.60లక్షలతో నిర్మించనున్న దేవరపల్లి శివారు మట్టలదొడ్డి రహదారికి భూమి పూజ నిర్వహించారు. అనంతరం రూ.90 లక్షలతో ఆలమూరు పల్లిపేట నుంచి సూర్యారావుపేట వరకు నిర్మించనున్న బీటీ రోడ్డుకు భూమి పూజ నిర్వహించారు. తదుపరి ఆలమూరులో రూ. 80 లక్షల రూపాయలతో నిర్మించిన సీసీ రహదారులను ప్రారంభించారు.



మొదటి పేజీ తరువాయి

## ఉద్యోగ, ఉపాధ్యాయ నేతలతో చంద్రబాబు రేపు కీలక భేటీ

అమలుతో పాటు కరవు భత్యం బకాయిలు తదితర కీలక అంశాలపై ఈ భేటీలో సమగ్రంగా చర్చించనున్నారు. నిన్న సచివాలయంలో ఏపీ జేఏసీ నాయకులు ఎ. విద్యాసాగర్, డీవీ రమణ, భారతీ ప్రసాద్ తదితరులు సీఎం చంద్రబాబును కలిశారు. ఉద్యోగ వర్గాల్లో నెలకొన్న ఆందోళనలను, ఆర్థికేతర సదుపాయాల పెండింగ్ అంశాలను విద్యాసాగర్ సీఎంకు వివరించి, తక్షణ పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి... ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం అత్యంత కట్టుబడి ఉందో స్పష్టం చేశారు. తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ఉద్యోగులకు అందాల్సిన న్యాయమైన ప్రయోజనాలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి సానుకూలంగా చర్చలు జరుపుతున్న తరుణంలో, ఉద్యోగ సంఘాలు తొందరపడి ఆందోళన బాట పట్టడంపై సీఎం చంద్రబాబు కొంత అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. సమగ్ర చర్చల వేదిక అందుబాటులో ఉన్నప్పుడు కొద్దిగా ఓర్పు వహించాలని ఆయన కోరారు. ముఖ్యమంత్రితో భేటీపై హర్షం వ్యక్తం చేసిన ఏపీ జేఏసీ నేతలు... ప్రభుత్వం వైపు నుంచి సానుకూల చర్చల ప్రక్రియను స్వాగతిస్తున్నామని, సీఎం స్థాయిలోనే ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు.

## కేరళలో నారా లోకేశ్.. అమృతపురిలో 'అమ్మ' ఆశీర్వాదం...

ఆధ్యాత్మిక కేంద్రమైన మాతా అమృతానందమయి (అమ్మ) ఆశ్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మను దర్శించుకుని ఆమె ఆశీస్సులు అందుకున్నారు. ఇది పూర్తిగా లోకేశ్ వ్యక్తిగత పర్యటన అని, అధికారిక కార్యక్రమం కాదని తెలుస్తోంది. అమృతపురిగా ప్రసిద్ధి చెందిన ఈ ఆశ్రమంలో లోకేశ్ దాదాపు మూడు గంటల పాటు గడిపారు. ఆశ్రమ ప్రాంగణంలో ఉన్న కాళీమాత ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మను కలుసుకుని ఆశీర్వాదం పొందారు. ఆశ్రమంలోని గజరాజులకు పండ్లు అందించారు. ఈ పర్యటన తనకు ఎంతో ఆధ్యాత్మిక సంతృప్తినిచ్చిందని లోకేశ్ పేర్కొన్నారు. తన పర్యటనకు సంబంధించిన వివరాలను ఆయన తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. ఈ ఆధ్యాత్మిక పర్యటనలో భాగంగా లోకేశ్ అక్కడి విద్యాసంస్థలను కూడా పరిశీలించారు. ఆశ్రమం ఆధ్వర్యంలో నడుస్తున్న అమృత విశ్వ విద్యాపీఠంతో పాటు, అమృత ఆయుర్వేద కళాశాలను ఆయన సందర్శించారు. అక్కడి విద్యాబోధన, మౌలిక సదుపాయాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఏపీ విద్యాశాఖ మంత్రిగా ఆయన విద్యాపీఠాన్ని సందర్శించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## ఆ సన్నని గొంతే ఆశలు నింపి.. నేపాల్ టన్నెల్ ఆపరేషన్‌లో అద్భుతం!

వారూ ప్రాణాలతో బయటపడతారనే ఆశలు చిగురించాయి. మెకానికల్ ఫోర్‌మెన్ సంజయ్ సాహ్, మెకానికల్ సూపర్‌వైజర్ కబీర్ మహర్జన్‌ను సొరంగంలో 170 మీటర్ల లోతు నుంచి కాపాడినట్లు నేపాల్ ఆర్మీ ప్రతినిధి బ్రిగేడియర్ జనరల్ రాజారామ్ బాస్నెట్ వెల్లడించారు. సహాయక చర్యలను పర్యవేక్షించే అధికారులు, నిపుణులు వెల్లడించిన వివరాల ప్రకారం.. మామూలుగా సొరంగం వంటి భూగర్భ ప్రాంతాల్లో కార్మికులు, పర్యాటకులకు సురక్షితమైన ఆక్సిజన్‌తో కూడిన ఎయిర్ ప్యాకెట్స్, ట్రాప్డ్ వాటర్ ఉంటాయి. టన్నెల్ లోపల హానికర వాయువుల కారణంగా ప్రాణాలు కోల్పోకుండా బయటనుంచి పైపులు ద్వారా ఆక్సిజన్ పంపుతుంటారు. మరోవైపు, టన్నెల్ (చీవజుూఖశ్రీ ఎబఅఅవశ్రీ =వంఎబవ)లో చిక్కుకుపోయిన సందర్భంలో తమను తాము రక్షించుకోవడానికి ఎత్తుగా ఉన్నవైపు వస్తుంటారు. కానీ, నేపాల్ (చీవజుూఖశ్రీ) జల ప్రళయంలో రాళ్లు, వరద, బురద పెద్ద ఎత్తున కొట్టుకురావడంతో అవి వారిని కిందికి నెట్టేసి ఉండొచ్చు కూడా. చిక్కుకున్న వారు ప్రాణాలతో ఉన్నారా..? లేరా..? అనే ఊగిసలాట మధ్య సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. బండరాళ్లు, శిథిలాలు తొలగిస్తుండగా.. సమీపానికి వెళ్లేకొద్దీ వారికి లోపల ఉన్నవారి గొంతు సన్నగా వినిపించింది. లోపల దొరికిన నీరు, ఆహారంతో ప్రాణాలు నిలబెట్టుకున్న ఇద్దరు వ్యక్తులు సహాయక సిబ్బందికి కనిపించారు. ప్రమాదకర పరిస్థితుల్లో వారు సొరంగంలోకి దిగి, ఆ ఇద్దరినీ బయటకు తీసుకొచ్చిన దృశ్యాలను నేపాల్ ఆర్మీ 'ఎక్స్' వేదికగా షేర్ చేసింది. "ఆశ అందించిన అద్భుత విజయం ఇది" అని పేర్కొంది. "ఈ రెస్క్యూ ఆపరేషన్ అన్నింటినీ తిరగరాస్తోంది (చీవజుూఖశ్రీ ఎబఅఅవశ్రీ =వంఎబవ). ఎందుకంటే ఇంతకముందెప్పుడు ఈ స్థాయిలో విద్యుత్ కేంద్రాలు ధ్వంసమై, పలు సొరంగాల్లో సహాయక చర్యలు చేపట్టిన పరిస్థితి లేదు. కార్ల పరిమాణంలో ఉన్న రాళ్లను పగలగొట్టాం. ఇద్దరిని కాపాడటంతో లోపల ఉన్నవారు బతికే ఉండొచ్చనే అనుమానానికి ఇప్పుడు మాకు ఆధారం లభించింది. మేం పడిన శ్రమకు ఫలితం కనిపిస్తోంది" అని ఈ ఆపరేషన్‌ను పర్యవేక్షిస్తున్న టన్నెల్ రెస్క్యూ ఎక్స్‌పర్ట్ ఆర్నాల్డ్ డిక్స్ జాతీయ మీడియాతో అన్నారు. 2023లో ఉత్తరాఖండ్ టన్నెల్ రెస్క్యూ ఆపరేషన్‌లో కీలకంగా వ్యవహరించిన ఆస్ట్రేలియాకు చెందిన ఈ నిపుణుడు.. భారత్‌కు సుపరిచితులు. ప్రస్తుతం టన్నెళ్ల వద్ద సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఇది పునర్జన్మ.. ఇది తనకు పునర్జన్మ అని మెకానికల్ ఫోర్‌మెన్ సంజయ్ సాహ్ అన్నారు. ప్రాణాపాయ స్థితిలో హరే కృష్ణ మహామంత్రాన్ని జపిస్తూనే ఉన్నానని చెప్పారు.

# ఆపదలో ఆపన్నహస్తం...

# నిరుపేద కుటుంబానికి జీవీఆర్ భరోసా!

**కుటుంబ పోషకుడు ప్రమాదంతో మంచానికే పరిమితం... కష్టకాలంలో అండగా నిలిచిన జీవీ రామచంద్రరావు**

**రోజువారీ కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న శ్రీనుకు రూ.10 వేల ఆర్థిక సాయం**

**అవసరమైన ప్రతి వేళా సహాయ సహకారాలు అందిస్తానని జీవీ భరోసా**

**సిటిజెన్ టైమ్స్, విశాఖపట్నం, సెప్టెంబర్ 04 :**

కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉంటూ రోజువారీ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్న ఓ యువకుడు అనుకోని ప్రమాదానికి గురై మంచానికే పరిమితం కావడంతో ఆ నిరుపేద కుటుంబం తీవ్ర ఆందోళనలో పడింది. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యులు జీవీ రామచంద్రరావు వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి ఆపన్నహస్తం అందించారు. విశాఖపట్నం పరిధిలోని అన్నానగర్ 11వ వార్డుకు చెందిన శ్రీను రోజువారీ కూలీగా పనిచేస్తూ తన కుటుంబాన్ని పోషిస్తున్నాడు. నిరుపేద కుటుంబానికి చెందిన శ్రీనే ఇంటికి ప్రధాన ఆధారంగా ఉండగా, ఇటీవల జరిగిన ప్రమాదంలో అతని కాలు ఎముక విరిగింది. దీంతో వైద్యులు శ్రీనుకు శస్త్రచికిత్స నిర్వహించి కాలుకు ప్లేట్లు అమర్చారు. పూర్తిస్థాయిలో కోలుకోవడానికి సుమారు ఆరు నెలల పాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. కుటుంబ పోషణ బాధ్యతలు నిర్వహిస్తున్న శ్రీను ఇంతకాలం పనికి వెళ్లలేని పరిస్థితి ఏర్పడటంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆర్థిక



ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయం గ్రామ పెద్దల ద్వారా తెలుసుకున్న జీవీ రామచంద్రరావు మానవీయ కోణంలో స్పందించారు. అన్నానగర్ యూత్ సభ్యులు, శ్రీను కుటుంబ సభ్యుల సమక్షంలో బాధిత యువకుడు శ్రీనుకు రూ.10,000 నగదు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా జీవీ రామచంద్రరావు మాట్లాడుతూ, కుటుంబానికి ఆధారంగా ఉన్న యువకుడు ప్రమాదానికి గురై పనికి దూరం కావడం బాధాకరమన్నారు. శ్రీను ధైర్యంగా ఉండాలని, త్వరగా కోలుకుని తిరిగి సాధారణ జీవితంలోకి రావాలని ఆకాంక్షించారు. అవసరమైన ప్రతి సందర్భంలోనూ శ్రీనుకు, అతని కుటుంబానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని భరోసా ఇచ్చారు. ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబం గురించి తెలుసుకున్న వెంటనే స్పందించి ఆర్థిక సహాయం అందించడం జీవీ రామచంద్రరావు సేవాభావానికి నిదర్శనమని అన్నానగర్ యూత్ సభ్యులు, స్థానికులు పేర్కొన్నారు. కష్టకాలంలో కుటుంబానికి అండగా నిలిచిన జీవీ రామచంద్రరావుకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## పొడుగుపాలెంలో భక్తి వెల్లువ

**వైభవంగా గ్రామదేవతల విగ్రహ ప్రతిష్ఠ**





**ఆనందపురం, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 04:**

ఆనందపురం మండలం పొడుగుపాలెం గ్రామంలో శ్రీ బంగారమ్మతల్లి, శ్రీ కుంచాలమ్మతల్లి నూతన ఆలయాల్లో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు మేళతాళాల నడుమ చీరసారె, పసుపు, కుంకుమలను ఊరేగింపుగా తీసుకొచ్చారు. వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించి అమ్మవార్ల విగ్రహాలను శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. వేడుకలకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవార్ల ఆశీస్సులు పొందారు.

## సభాపతికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సురేంద్ర



**అనకాపల్లి: సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 04:**

అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో ఆంధ్రప్రదేశ్ శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు జన్మదిన సందర్భంగా వారి స్వగృహంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్స్ వేగి పరమేశ్వరరావు,బొడ్డేడ శ్రీనివాసరావు,ఆళ్ల మంగరాజు తదితరులు ఆయనను కలిసి దుస్సాలువతో సత్కరించి,లక్కీ బాంబూ మొక్కలను అందజేసి, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం నర్సీపట్నంలో 6వ తారీఖున జరగబోయే బీసీ సమావేశం కోసం కూడా చర్చించారు.

## మండలంలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు





**పద్మనాభం, , సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 04:**

పద్మనాభం మండలంలో గ్రామ గ్రామాన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఎంతో ఘనంగా నిర్వహించారు. ముఖ్యంగా చిన్నపిల్లలు శ్రీకృష్ణ రాధా వేషధారణలతో అందరిని ఆకట్టుకున్నారు. శ్రీకృష్ణ దేవాలయాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించా రు. వెంకటాపురం గ్రామంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఎంతో ఘనంగా స్థానిక ప్రజానీకం నిర్వహించారు. చిన్నపిల్లలు శ్రీకృష్ణ వేషధారణ వేసినారు. పెద్దలు వివిధ సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి అనంతరం ఉట్టి కొట్టడం కార్యక్రమాన్ని నిర్వహించి ఈ వేడుకలను ఎంతో ఆనందంగా జరుపుకున్నారు. ఈ కార్యాక్రమంలో గ్రామ పెద్దలు, మాజీసర్పంచ్ కర్రి.రమణ, ఎంపిటీసీ శీర సూరప్పుడు , ఎక్స్ ఎంపీటీసీ అవాల. గంగరాజు, కర్రి.సన్యాసప్పుడు, డీలర్ కర్రి.శ్రీను, అల్లు.బంగారబాబు,కర్రి.శ్రీగణేష్, వెంకటాపురం యూత్ మరియు ప్రజల సమక్షంలో ఈ వేడుకలను నిర్వహించారు.

# ప్రమాదం కబళించిన జీవితం...

# అండగా నిలిచిన యువసేన!

**నాలుగేళ్లుగా మంచానికే పరిమితమైన యాత కార్మికుడు**

**రీసు రమణకు రూ.10 వేల ఆర్థిక చేయూత**

**ప్రభుత్వం, దాతలు స్పందించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని**

**జై యాత యువసేన విజ్ఞప్తి**




**పద్మనాభం, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 04:**

కుటుంబానికి అండగా నిలవాల్సిన ఓ యువకుడు అనుకోని ప్రమాదం కారణంగా నాలుగేళ్లుగా మంచానికే పరిమితమయ్యాడు. కూలి పనులకు వెళ్లిన సమయంలో జరిగిన ప్రమాదం అతని జీవితాన్నే మార్చేసింది. ఆపదలో ఉన్న అతని పరిస్థితిని తెలుసుకున్న జై యాత యువసేన సంక్షేమ సేవా సంఘం సభ్యులు మానవీయంగా స్పందించి బాధితుడికి ఆర్థిక చేయూత అందించారు. పద్మనాభం మండలం కురుపల్లి గ్రామానికి చెందిన యాత కార్మికుడు రీసు రమణ (35) నాలుగు సంవత్సరాల క్రితం కూలి పనుల నిమిత్తం పొలానికి వెళ్లిన సమయంలో ప్రమాదానికి గురయ్యాడు. ట్రాక్టర్ అతని నడుము భాగంపై నుంచి వెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదం కారణంగా నడుముకు తీవ్ర గాయం కావడంతో అప్పటి నుంచి ఆయన మంచానికే పరిమితమై జీవనం సాగిస్తున్నారు. రీసు రమణ పరిస్థితిని తెలుసుకున్న జై యాత యువసేన సంక్షేమ సేవా సంఘం సభ్యులు ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. అనంతరం సంఘ సభ్యులు, దాతల సహకారంతో సమకూర్చిన రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుప్ప రామలక్ష్మి రూ.3 వేల ఆర్థిక సహాయం అందించి తన వంతు చేయూతనందించారు. ఇతర దాతల సహకారంతో మిగిలిన మొత్తాన్ని సమకూర్చి బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా జై యాత యువసేన సంక్షేమ సేవా సంఘం సభ్యులు మాట్లాడుతూ, నాలుగేళ్లుగా మంచానికే పరిమితమై తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రీసు రమణ కుటుంబాన్ని ప్రభుత్వం ప్రత్యేకంగా ఆదుకోవాలని కోరారు. అలాగే సేవా సంస్థలు, దాతలు ముందుకు వచ్చి బాధిత కుటుంబానికి తమ వంతు సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జై యాత యువసేన సంక్షేమ సేవా సంఘం కోశాధికారి కుప్ప రామలక్ష్మి, ప్రధాన కార్యదర్శి ముడసల శ్రీను, వర్కింగ్ ప్రెసిడెంట్ గండి బోయిన రాంబాబు, జనరల్ సెక్రటరీ రీసు సంతోష్ కుమార్, పద్మనాభం సొసైటీ సెక్రటరీ బత్తిన అప్పారావు, సంఘ సభ్యులు మెరుగు రాము తదితరులు పాల్గొన్నారు.

# ఎంఆర్పీయస్, యంయస్పీ, ఎంయస్ఎఫ్ నూతన కమిటీల ఎన్నిక

**అయినవిల్లి సిటిజన్ టైమ్స్. గోదావరి జిల్లాల బ్యూరో ఇంచార్జ్ నాగ శ్రీనివాస్.. సెప్టెంబర్ 4**

మహాజన నేత మాదిగ రిజర్వేషన్ పోరాటసమితి వ్యవస్థాపక అధ్యక్షులు మందా కృష్ణమాదిగ ఆదేశాలమేరకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎమ్మార్పీఎస్ ఇన్చార్జ్ డాన్ సూరి మాదిగ ఆధ్వర్యంలో జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు సవరపు బైరవమూర్తి మాదిగ అధ్యక్షతన జిల్లా ఎం ఎస్ పి అధ్యక్షులు యార్లగడ్డ సత్తిబాబు మాదిగ, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు నేదునూరి వీర్రాజు మాదిగ హాజరై అయినవిల్లి మండలంలో నూతనవీ ఞాూ కమిటీ నిర్మాణం చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అయినవిల్లి మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షునిగా సవరపు భీమేష్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా నవుంద్రు సురేష్, అయినవిల్లి మండల ఎం ఎస్ పి అధ్యక్షునిగా సత్తాల కృష్ణ, అయినవిల్లి మండల ఎంఎస్ఎఫ్ అధ్యక్షునిగా నవుంద్రు వంశీ అదే విదంగా ఉపాధ్యక్షులుగా కొడమంచిలి దుర్గాప్రసాద్, అధికార ప్రతినిధిగా నవుడూరి శ్రీధర్, కార్యదర్శిగా రాయి వీరవెంకట సూర్యనారాయణప్రసాద్, కోశాధికారిగా తొత్తరమూడి శ్రీనివాసరావు తదితర కమిటిని ప్రకటించి ఈ కమిటీని పూలమాలలతో సత్కరించారు.



ఈ కార్యక్రమంలో డాన్ సూరి మాదిగ, సవరపు బైరవమూర్తి మాదిగ, యార్లగడ్డ సత్తిబాబు మాదిగ, నేదునూరి వీర్రాజు మాదిగ, సవరపు సత్యనారాయణ మాదిగ, నేదునూరి దుర్గారావు మాదిగ, కన్నిపాముల రాంబాబు మాదిగ,తదితర ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కమిటీలు భవిష్యత్తులో మాదిగల మహాత్ముడు,మహాజన నేత పద్మశ్రీ మందా కృష్ణ మాదిగ ఏ పిలుపు ఇచ్చినా ఆ పిలుపుకు కట్టుబడి పనిచేసి మండలంలో మాదిగసామాజిక వర్గ ఐక్యతకు కృషిచేస్తూ అందుబాటులో ఉంటామని ఒక ప్రకటనలో తెలిపారు.

## పిచ్చికుక్క దాడి ఐదుగురికి గాయాలు

**అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్న గ్రామస్తులు**



**అల్లవరం సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 4**

మండలం లోని బోడసకుర్రు గ్రామం పిచ్చికుక్క హల్చల్ చేసింది. సుమారు నలుగురిని కరిచినట్టుగా స్థానికులు గుర్తించారు. కాలాడి కౌశిక్, వయసు 5 సం.లు, సంగని లోహిత్ వర్మ, 7 సం.లు, నార్లగంటి జ్యోతి 5 సం.లు, బండారు అఖిల్ 5 సం.లు వీరిని కలిసినట్టుగా గుర్తించారు. పిచ్చి కుక్కను గ్రామస్తులు గాలిస్తున్నారు. మరింతమందిని కలుస్తుందోనని ప్రజలు భయపడుతున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రజల కోరుతున్నారు.

## నాగర్ కర్నూల్ లో కన్నుల పండువగా కృష్ణాష్టమి వేడుకలు

**సిటిజన్ టైమ్స్ నాగర్ కర్నూల్ సెప్టెంబర్ 4**

నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను అత్యంత ఘనంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరై ఈ సంబరాలను జయప్రదం చేశారు. ఈ పండుగ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాల్లో వర్షిత్ యాదవ్ విజేతగా నిలిచాడు. బాలుడు శ్రీకృష్ణుడి వేషధారణలో మురిపిస్తూ, మున్సిపల్ చైర్మన్ సునీంద్ర చేతుల మీదుగా ట్రోఫీని అందుకున్నాడు. ఉత్సాహభరితమైన వాతావరణంలో జరిగిన ఈ వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ సునేంద్ర, స్థానిక కౌన్సిలర్లు కొత్త గంగాధర్, జేపీ చారి తదితరులు పాల్గొని చిన్నారులను, నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో యాదవ సంఘం నాయకులు తిరుమల్ యాదవ్, బచ్చన్న, శ్రీనివాసులు తదితరులు క్రియాశీలక పాత్ర పోషించి, ఏర్పాట్లను పర్యవేక్షించారు.



# గురువే దైవం.. గురువులకు ఘన నివాళి!

## రాష్ట్రపతి పురస్కార గ్రహీత ఉత్తమ ఉపాధ్యాయులకు తెలుగు శక్తి విశిష్ట సత్కారం

### - ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలకు సర్వం సిద్ధం

### - కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించిన ప్రొఫెసర్ జి.ఎస్.ఎన్. రాజు

విశాఖపట్నం, సిటిజెన్ టైమ్స్, సెప్టెంబర్ 04:

విద్యార్థుల జీవితాల్లో జ్ఞానజ్యోతులు వెలిగించి, వారి భవిష్యత్తుకు బాటలు వేసే గురువులను గౌరవించుకోవడం సమాజ బాధ్యత అని, ఉపాధ్యాయుల సేవలను గుర్తించి వారికి సముచిత గౌరవం అందించాలనే లక్ష్యంతో తెలుగు శక్తి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. తెలుగు శక్తి అధినేత బి.వి.రామ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను మాజీ కులపతి సెంచూరియన్ యూనివర్సిటీ, మాజీ ఉపకులపతి ఆంధ్ర యూనివర్సిటీ, జాతీయ ఐఈటీఈ జీవితకాల సాఫల్య పురస్కార గ్రహీత ప్రొఫెసర్ జి.ఎస్.ఎన్.రాజు శుక్రవారం విశాఖపట్నంలోని తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జి.ఎస్.ఎన్.రాజు మాట్లాడుతూ భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గొప్ప తత్వవేత్త, ఆదర్శ ఉపాధ్యాయుడని కొనియాడారు. దేశ భవిష్యత్తును



తీర్చిదిద్దడంలో, యువతను సరైన మార్గంలో నడిపించడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమన్నారు. ఇలాంటి గొప్ప ఉద్దేశంతో ఉపాధ్యాయులను సన్మానించే కార్యక్రమాన్ని చేపట్టిన బి.వి.రామ్‌ను అభినందించారు. తెలుగు శక్తి అధినేత బి.వి.రామ్ మాట్లాడుతూ విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివన్నారు. భారత రాష్ట్రపతుల అమృత హస్తాల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న వారికి ఈ సందర్భంగా తెలుగు శక్తి ఆధ్వర్యంలో ఘన సత్కారం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయ దినోత్సవ ప్రత్యేక కార్యక్రమం శనివారం ఉదయం 10.30 గంటలకు విశాఖపట్నంలోని హోటల్ మేఘాలయలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. విద్యావేత్తలు, ఉపాధ్యాయులు, మేధావులు, ప్రముఖులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## ప్రజల కష్టాలను పరిష్కరించడమే ధ్యేయం

### ఎమ్మెల్యే ఆనందరావు



**అమలాపురం సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 04**

అమలాపురం పట్టణం హౌసింగ్ బోర్డు కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు "ప్రజాదర్బార్" నిర్వహించారు. ఈ దర్బార్‌కు నియోజకవర్గం నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రజల నుంచి ఎమ్మెల్యే గారు నేరుగా 32 వినతి పత్రాలను (అర్జీలను) స్వీకరించారు. సమస్య ఏదైనా సరే.. నా వద్దకు వస్తే పరిష్కారం దొరుకుతుందనే నమ్మకంతో వచ్చిన ప్రతి ఒక్కరి బాధను ఓపిగ్గా విని, అర్జీలను పరిశీలించారు. సివిల్, రెవెన్యూ, పెన్షన్లు మరియు ఇతర వ్యక్తిగత, ప్రాంతీయ సమస్యలపై వచ్చిన అర్జీలను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఫోన్ ద్వారా ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయమని ,ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని అధికారులకు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బెండమూర్లంక సెంటర్లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



**అల్లవరం సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్3**

మండలం లోని బెండమూర్లంక సెంటర్లో గుర్రం కృష్ణమూర్తి చారిటబుల్ ట్రస్ట్ వారి కుమారుడు పెద్ద కాపు ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు 36 సంవత్సరాలుగా కృష్ణాష్టమి వేడుకలు విద్యార్థులకు వృద్ధులకు బట్టలు పంపిణీ భారీస్థాయిలో అన్న సమారాధన జరిగింది. ఈ సందర్భంగా మెట్ల రామ్మూర్తి సొసైటీ మాజీ అధ్యక్షులు గునిశెట్టి రోహిణి కుమార్ మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా కృష్ణమూర్తి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరుగుతున్నాయి.ఈ చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వేడుకలలో పాల్గొంటున్నారు అని తెలిపారు గుర్రం పెద్ద కాపు ఆధ్వర్యంలో జరిగే వేడుకలు పెద్దకాపు ఇతర దేశాలలో ఉన్నప్పటికీ ఈ వేడుకలు కొనసాగుతున్నాయి అని తెలిపారు. ఈ సమావేశంలో గుర్రం బాబ్జి, గిడుగు భాస్కర్ రావు గుర్లింక కొండ కేదారిశెట్టి పురుషోత్తం బ్రదర్స్ గుర్రం వెంకటేశ్వరరావు పడాల వెంకటేశ్వరరావు నవబత్తుల నాగు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## పాదగయు క్షేత్రానికి పోటెత్తిన భక్తులు




**పిఠాపురం: (సిటిజన్ టైమ్స్): సెప్టెంబర్; 04:**

కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాదగయు క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. శ్రావణమాసం నాలుగో శుక్రవారం కావడంతో ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. ఈ వ్రతంలో పాల్గొన్న మహిళల కోసం ఉపముఖ్యమంత్రి కొణిదలపవన్ కళ్యాణ్ పట్టుచీరలు కానుకగా పంపించారు. మొత్తం 12,000 మంది మహిళలకు 5 విడతలగా ఈ చీరలను పంపిణీ చేయనున్నారు.

## కృష్ణ జన్మాష్టమి వేడుకల్లో పాల్గొన్న ఎంపీ హరీష్

**అయినవిల్లి సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 4**

అంబేద్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం నల్లచెరువు గ్రామంలో హరే కృష్ణ మందిర్ ఆధ్వర్యంలో జరిగిన శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకల్లో అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో హరీష్ బాలయోగి హాజరై, స్వామి వారి ఆశీస్సులు తీసుకున్నారు.



## ప్రజా సమస్యలే లక్ష్యముగా ప్రజా గ్రీవెన్స్



**కొవ్వూరు: (సిటిజన్ టైమ్స్): సెప్టెంబర్ :04**

తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సీసీరోడ్ల నిర్మాణం, పింఛన్ల మంజూరు వంటి సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. ప్రజల సమస్యలను సానికూలంగా పరిశీలించి సమస్యల పరిష్కారాన్ని కృషి చేస్తామని శాసనసభ్యులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కోర్టును ఆశ్రయించిన రైతులు



**అమరావతి: (సిటిజన్ టైమ్స్);; సెప్టెంబర్; 04;**

రాష్ట్రంలో రొయ్యల ఫీడ్ ధరల పెంపుపై ఆక్వా రైతులు కొట్టును ఆశ్రయించారు. ప్రభుత్వం అనుమతి లేకుండా ఫీడ్ ధరలు పెంచారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిబ్రవరి నుంచి కిలో ఫీడ్ పై రూ.21 పెంచారని తెలిపారు. గత్యంతరం లేక కోర్టు ఆశ్రయించామని ఆక్వా రైతులు వెల్లడించారు. దీనిపై కోర్టు విచారణ జరిపి జూన్ ధరలనే సెప్టెంబర్ 30 వరకు కొనసాగించాలంటూ తీర్పు ఇచ్చింది.

## హత్య కేసులో నిందితుల అరెస్ట్

**కాకినాడ: (సిటిజన్ టైమ్స్): సెప్టెంబర్: 04:**

కాకినాడలో ని భానుగుడి కోడలి వద్ద జరిగిన జిమ్ ట్రైనర్ సతీష్ రెడ్డి హత్య కేసులో నలుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులు సాయికిరణ్, సత్యనారాయణ, దుర్గాప్రసాద్, ఆది కృష్ణను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. ఓ యువతి విషయంలో సతీష్ రెడ్డి సాయికిరణ్ మధ్య గత కొద్ది కాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఒకసారి కలిసి మాట్లాడుకుందామని సతీష్ రెడ్డికి సాయికిరణ్ ఫోన్ చేసి పిలిచాడు. ఆగస్టు 26న తన ముగ్గురు స్నేహితులతో కలిసి సతీష్ రెడ్డి పై దాడి చేసి హత్య చేశాడు.



# ఇంటింటా తెలుగుదేశం జోరు...

# కోటి ఇళ్ల మైలురాయితో కొత్త చరిత్ర!

### ప్రజల గడపగడపకు చేరిన పార్టీ సందేశం

### ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న కార్యక్రమం

### - టీడీపీ నాయకుడు కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్

**ఆనందపురం, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 04:**

తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇంటింటికీ తెలుగుదేశం--2026' కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా కొనసాగుతూ కోటి ఇళ్ల సందర్శనతో సరికొత్త చరిత్ర సృష్టించిందని టీడీపీ నాయకుడు కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ తెలిపారు. ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలు, అవసరాలను తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబాన్ని నేరుగా కలుసుకుని వారి సమస్యలు, అవసరాలను తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు, ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజానుకూల విధానాలపై అవగాహన కల్పిస్తూ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని అన్నారు. కోటి ఇళ్ల సందర్శన మైలురాయిని చేరుకోవడం తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమష్టి కృషికి నిదర్శనమని కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు అహర్నిశలు శ్రమిస్తున్న ప్రతి నాయకుడు, కార్యకర్తను ఆయన అభినందించారు. ప్రజలతో నిరంతరం అనుసంధానమవుతూ వారి సమస్యలను గుర్తించి



పరిష్కారానికి కృషి చేయడమే తెలుగుదేశం పార్టీ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ప్రజలకు మరింత చేరువవుతూ, వారి నమ్మకాన్ని మరింత బలోపేతం చేసుకుంటూ 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్తామని కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ తెలిపారు.

# వినాయక ఉత్సవాల్లో భద్రతే ప్రథమం..

### నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు!

### ప్రతి మండపానికి తప్పనిసరి అనుమతి..

### ప్రశాంత వాతావరణంలో ఉత్సవాల నిర్వహణకు సీఐ ఎర్రం నాయుడు దిశానిర్దేశం

**ఆనందపురం, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 04:**

వినాయక చవితి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో పాటు ప్రశాంత వాతావరణంలో సాగాలని, ప్రజల భద్రతకు ఎలాంటి విఘాతం కలగకుండా మండపాల నిర్వాహకులు పోలీస్ శాఖ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆనందపురం పోలీస్‌స్టేషన్ సీఐ వీవీసీఎం ఎర్రం నాయుడు స్పష్టం చేశారు. మండల పరిధిలో ఏర్పాటు చేసే ప్రతి వినాయక మండపానికి ప్రభుత్వ అనుమతి తప్పనిసరి అని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ ఉన్నతాధికారులు, విశాఖపట్నం నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు వినాయక ఉత్సవాల సందర్భంగా భద్రత, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు గణేష్ ఉత్సవ్ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పోలీసుల పరిశీలన అనంతరం అనుమతి పొందిన మండపాలకు నిరభ్యంతర ధ్రువపత్రం ఆన్‌లైన్‌లో జారీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అనుమతి లేకుండా మండపాలు ఏర్పాటు చేయడం, నిబంధనలకు విరుద్ధంగా కార్యక్రమాలు నిర్వహించడం చట్టవిరుద్ధమని హెచ్చరించారు. మండపాలు, ఊరేగింపులు, విగ్రహ నిమజ్జనం సందర్భంగా డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. అసాంఘిక, అసభ్యకర కార్యక్రమాలకు కూడా అనుమతి ఉండదని



తెలిపారు. నిబంధనలకు లోబడి సాధారణ ధ్వని వ్యవస్థలను మాత్రమే వినియోగించాలని సూచించారు.

**ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఏర్పాట్లు..:** విగ్రహాల ఊరేగింపు, నిమజ్జనం సమయంలో ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ముందస్తు చర్యలు చేపట్టాలని సీఐ ఎర్రం నాయుడు సూచించారు. ప్రధాన రహదారులు, కూడళ్లు, ప్రజల రాకపోకలకు ఆటంకం కలిగే ప్రాంతాల్లో మండపాలు ఏర్పాటు చేయరాదన్నారు. మండపాల వద్ద భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంతో పాటు నిర్వాహకులు, స్వచ్ఛంద సేవకులను అందుబాటులో ఉంచాలని సూచించారు. అగ్ని, విద్యుత్ ప్రమాదాల నివారణకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ప్రజల భద్రతే లక్ష్యంగా, భక్తుల ఆనందానికి భంగం కలగకుండా ఉత్సవాలు నిర్వహించేందుకు పోలీస్ శాఖ అన్ని చర్యలు తీసుకుంటోందని సీఐ ఎర్రం నాయుడు పేర్కొన్నారు. యువత, ఉత్సవ కమిటీలు, ప్రజలు పోలీసులకు పూర్తి సహకారం అందించి వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించాలని కోరారు. ప్రభుత్వ, పోలీస్ శాఖ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# కల్తీ బెల్లం సీజ్



**విజయవాడ: (సిటిజన్ టైమ్స్): సెప్టెంబర్ :04:**
ఎన్టీఆర్ జిల్లాలో ఆహార భద్రత అధికారులు కల్తీ ఆహార పదార్థాలపై దాడులు కొనసాగిస్తున్నారు. గొల్లపూడి మార్కెట్, బీసెంట్ రోడ్ లో తనిఖీలు నిర్వహించి బెల్లంనమూనాలను సేకరించారు. ఇంగువ పొడి కి సంబంధించి మరో రెండు నమూనాలను సేకరించారు. కృత్రిమ ఫుడ్ కలర్స్ కలిసినట్లు అనుమానించిన 1250 కిలోల బెల్లాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సేకరించిన నమూనాలను పరీక్షించడానికి పంపనున్నట్లు తెలిపారు.

## తపాలా శాఖలో రియామని ఇంటర్నేషనల్ మనీ ట్రాన్స్ఫర్ సేవలు

### పోస్టల్ సూపర్డెంట్ చెరుకూరి శ్రీనివాస్




**అమలాపురం సిటిజన్ టైమ్స్ గోదావరి జిల్లాల బ్యూరో ఇన్చార్జి నాగ శ్రీనివాస్ సెప్టెంబర్ 4**
భారత ప్రభుత్వం తపాల శాఖ అనుబంధ సంస్థ ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ ద్వారా రియామని ఇంటర్నేషనల్ మనీ ట్రాన్స్ఫర్ సేవలు ఇప్పుడు మన తపాల శాఖ లో అందుబాటులో ఉన్నాయని అమలాపురం డివిజన్ తపాలా శాఖ డివిజనల్ సూపరింటెండెంట్ చెరుకూరి శ్రీనివాస్ తెలియజేశారు. ఇంటర్నేషనల్ మనీ ట్రాన్స్ఫర్ సేవలు మీ గ్రామంలోని తపాలా శాఖ కార్యాలయంలో బ్రాంచ్ తపాల శాఖ పోస్ట్ మాస్టర్ వద్ద అతి సులభంగా పొందుకొనే సౌకర్యం కల్పించడం జరిగిందని ప్రజలు విదేశాల నుండి నగదు పంపిణీ జరుపుకునే వాళ్లు సంబంధిత లబ్ధిదారు ఆధార్ పాన్ మరియు లావాదేవి పిన్ నెంబర్ వివరాలతో మీ దగ్గరలోని పోస్ట్ ఆఫీస్ ను సందర్శించి ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చని తెలిపారు.

## అక్షరాస్యతపై కూటమి ప్రభుత్వం తప్పుడు ప్రచారం



**తాడేపల్లి: (సిటిజన్ టైమ్స్): సెప్టెంబర్: 04:**
రాష్ట్రంలో మంత్రి నారా లోకేష్ ఏపీలో అక్షరాస్యత రేటు 2024లో 72.6% నుంచి 2026 నాటికి 82.1 శాతానికి పెరిగిందని చేసిన ప్రకటనపై మా జీ ముఖ్యమంత్రి వైసీపీ అధ్యక్షుడు జగన్ తీవ్రంగా స్పందించారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం తప్పుడు ప్రచారాన్ని చూసి షాక్ కి గురయ్యా నని జగన్ విమర్శలు గుప్పించారు. 2026 క్యాలెండర్ సంవత్సరంఇంకా పూర్తి కానందున అక్షరాస్యతకు సంబంధించి ఏ అధికారిక సంస్థ కూడా గణాంకాలనువిడుదల చేయలేదని జగన్ స్పష్టం చేశారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు

**అమలాపురం సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 4**
శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని అమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మాజీ చైర్ పర్సన్ దూడల విరీతాదేవిఫణి ల ఆర్థికసహాయంతో,పిరమిడ్ స్ప్రిచువల్ సొసైటీ సభ్యులచే ఏర్పాటు చేసిన శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఆలయంలో స్టేజ్ ప్రాంతం విద్యుద్దీపాలంకరణలతో ప్రత్యేక డెకరేషన్‌లతో ముస్తాబుచేశారు. తల్లిదండ్రులు తమ చిన్నారులకు రాధా, కృష్ణుల వేషాలు వేయించి తీసుకుని వచ్చారు.చిన్నారులకు రాధా, కృష్ణుల వేషాధారణ పోటీలు నిర్వహించారు. చిన్నారులచే నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.అనంతరం ఉట్టిని కొట్టారు. ఈ కార్యక్రమంలో దూడల విరీతాదేవి, దూడలఫణి, పిరమిడ్ స్ప్రిచువల్ సొసైటీ సభ్యులు కొవ్వూరి గాయత్రీ మిత్రబృందం తదితరులు పాల్గొన్నారు.



# ఒక్క చుక్క రక్తం.. ఒక నిండు ప్రాణాన్ని కాపాడుతుంది

## రక్తదాతలకు సినీ నటుడు శ్రీకాంత్ అభినందన

**బద్వేలు సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 4:**
రక్తదానం మనిషి ప్రాణాన్ని కాపాడుతుందని రక్తదానం మానవత్వానికి ప్రతీక అని, మహాపుణ్య కార్యమని ప్రముఖ సినీ నటుడు శ్రీకాంత్ అన్నారు. ఆపదలో ఉన్న వారికి రక్తాన్ని అందించి ప్రాణాలను కాపాడుతున్న రక్తదాతలు నిజమైన హీరోలని కొనియాడారు. కడప నగరంలోని పీఆర్ఆర్ఎం ఫార్మసీ కళాశాలలో ఖూన్ కా రిష్తా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన రక్తదాన కార్యక్రమానికి శ్రీకాంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమానికి ప్రొద్దుటూరుకు చెందిన తెలుగు సినీ నిర్మాత కె. రామకృష్ణ గౌరవ అధ్యక్షుడిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా పలుమార్లు రక్తదానం చేసి, అత్యవసర సమయాల్లో ఎంతోమందికి రక్తాన్ని అందిస్తూ సేవలందిస్తున్న కడప సమాచార పౌర సంబంధాల శాఖలో ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్న పిఎండి సోహైల్ అలీ ఖాన్ ను సినీ నటుడు శ్రీకాంత్ ఘనంగా సన్మానించారు. ఆయన సేవలను అభినందిస్తూ జ్ఞాపికను అందజేసి శాలువాతో సత్కరించారు.



ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ ఒక వ్యక్తి చేసే రక్తదానం మరో వ్యక్తి ప్రాణాలను కాపాడే అమూల్యమైన సేవ అని అన్నారు. ప్రమాదాలు, శస్త్రచికిత్సలు, అత్యవసర వైద్య పరిస్థితుల్లో రక్తం ఎంతో అవసరమవుతుందని, సరైన సమయంలో రక్తం అందకపోతే ప్రాణాపాయం ఏర్పడే అవకాశం ఉంటుందన్నారు. అలాంటి సమయంలో రక్తదాతలు అందించే రక్తం ఒక కుటుంబానికి తిరిగి ఆనందాన్ని అందిస్తుందని పేర్కొన్నారు.

"రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయలేం.. ఒక మనిషి మరో మనిషికి ఇవ్వగలిగే అత్యంత విలువైన కానుక రక్తం. మనం చేసే రక్తదానం ఒక నిండు ప్రాణాన్ని నిలబెట్టగలదు. అందుకే ప్రతి ఆరోగ్యవంతమైన వ్యక్తి రక్తదానానికి ముందుకు రావాలి" అని శ్రీకాంత్ పిలుపునిచ్చారు. రక్తదానం చేయడంలో ఎలాంటి అపోహలకు కార్యక్రమానికి గౌరవ అధ్యక్షుడిగా హాజరైన సినీ నిర్మాత కె. రామకృష్ణ మాట్లాడుతూ.. రక్తదానం ద్వారా ఎంతోమంది ప్రాణాలను కాపాడే అవకాశం ఉందని, సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. సమాజంలో రక్తదానంపై విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఖూన్ కా రిష్తా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రక్తదాతలు, సామాజిక సేవకులు, ట్రస్ట్ ప్రతినిధులు, వైద్య, విద్యా రంగాలకు చెందిన ప్రముఖులు, సినీ అభిమానులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు. "రక్తదానం చేయండి.. ప్రాణాలను కాపాడండి.. నిజమైన హీరోలుగా నిలవండి" అనే సందేశంతో కార్యక్రమాన్ని నిర్వహించారు.

## జనుపల్లిలో వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

### ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు



**అమలాపురం సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 4**
అమలాపురం రూరల్ మండలం జనుపల్లి గ్రామంలో ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీకృష్ణ జన్మాష్టమి మహోత్సవాలు అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక శోభతో జరిగాయి. ఈ వేడుకలకు అమలాపురం నియోజకవర్గ శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు, ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ వీధుల్లో చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల మనోహర వేషధారణలతో అలరించారు. సాంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, స్వయంగా పాల్గొని ఉట్టి లాగి అక్కడి భక్తులను, ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులను అలరించారు. చిన్నతనంలో శ్రీకృష్ణుడి లీలలను గుర్తుచేసేలా సాగిన ఈ ఉట్టి ఉత్సవం భక్తజనాన్ని వైమరిపించింది. అనంతరం, ఇస్కాన్ ప్రతినిధులు శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన,వివిధ సాంస్కృతిక పోటీలలో విజేతలకు ఎమ్మెల్యే ఆనందరావు చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ... శ్రీకృష్ణుడి బోధనలు, భగవద్గీత సందేశం మానవాళికి ఆదర్శమని, చిన్నారులలో ఆధ్యాత్మికత మరియు సాంప్రదాయ విలువలను పెంపొందించడానికి ఇస్కాన్ సంస్థ చేస్తున్న సేవలు ఎంతో ప్రశంసనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు , జనసేన నాయకులు ఇస్కాన్ ప్రతినిధులు, స్థానిక కూటమి నాయకులు, భక్తులు, గ్రామీణులు పెద్ద సంఖ్యలో చిన్నారులు పాల్గొన్నారు.

# కోనసీమ రైల్వేప్రాజెక్ట్ పై సీఎం స్పష్టమైన ప్రకటన చేయాలి..

**అమలాపురం సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 4**
సెప్టెంబర్ 9 న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అంబాజీపేట కు వస్తున్న నేపథ్యంలో కోనసీమ జేఏసి కార్యవర్గం సభ్యులు స్థానికంగా చిన్న వంతెన వద్ద రైల్వేలైన్ శంకుస్థాపన ప్రాంతంలో సమావేశం అయ్యారు.చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ఇదే ప్రాంతంలో శంకుస్థాపన జరిగి ఇప్పటికీ రెండున్నర దశాబ్దాలు అవుతుందని గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం కోటిపల్లి – నర్సాపురం రైల్వేలైన్ నిర్మాణపు పనులు నత్తనడకన జరుగుతుండడంపై సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు.ఇప్పటికే చంద్రబాబునాయుడు పలు సందర్భాల్లో కోనసీమ రైల్వేప్రాజెక్ట్ త్వరలో పూర్తివుతుందని హామీ ఇచ్చినప్పటికీ నిర్మాణపు పనుల్లో ఎటువంటి ప్రగతి లేదని వక్తలు పేర్కొన్నారు.భూసేకరణ పనులు పూర్తిగా ఆగిపోయాయని వాపోయారు.కాబట్టి ఈ రైల్వేప్రాజెక్ట్ ఎప్పటిలోగా పూర్తివుతుందో స్పష్టమైన ప్రకటన ను సీఎం అంబాజీపేట లో చేయాలని జేఏసి కార్యవర్గం డిమాండ్ చేసింది.ఆ దూసుగా కోనసీమ ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని కోరారు.కన్వీనర్ బండారు రామమోహన్ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం లో




డా.రాయుడు శ్రీరామచంద్ర మూర్తి,భాగవతుల మూర్తి, కరాటం ప్రవీణ్, పమ్మ నాగేశ్వరావు, ఎస్. శాంసన్, మడికి శ్రీరాములు,రంకిరెడ్డి శ్రీనివాసరావు, కల్వకొలను బాబు,కార్టూనిస్ట్ రాము,డా.చిత్రపు మాణిక్యమార్,డా.మధుర నరసింహమూర్తి,నంద్యాల నాయుడు, టి.సుందర రామయ్య,యార్లగడ్డ రవీందర్,మాచిరాజు నాగేశ్వరావు, ఏ.భాను మూర్తి,తదితరులు పాల్గొన్నారు.

# మోడీ క్రికెట్ లీగ్ ఫైనల్‌కు రంగం సిద్ధం



**అమలాపురం సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 4**
పట్టణంలోని బాలయోగి స్టేడియంలో నల్లా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మోడీ క్రికెట్ లీగ్ టోర్నమెంట్ గత పది రోజులుగా ఉత్సాహభరిత వాతావరణంలో నిర్విరామంగా కొనసాగుతోంది. టోర్నమెంట్‌లో భాగంగా శనివారం ఉదయం 10 గంటలకు ఫైనల్ మ్యాచ్ నిర్వహించనున్నట్లు నల్లా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు, ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రధాని నరేంద్ర మోదీ పేరుతో ఈ క్రికెట్ లీగ్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత పది రోజులుగా వివిధ జట్ల మధ్య ఉత్కంఠభరితంగా మ్యాచ్‌లు జరిగాయని, ఫైనల్ మ్యాచ్ మరింత ఆసక్తికరంగా సాగనుందని పేర్కొన్నారు. ఫైనల్ కు వెళ్ళిన రామ్ చరణ్ లీవెన్ వర్సెస్ బీసీసీఏ డ్రాగన్స్ మధ్య జరిగే మ్యాచ్‌ను వీక్షించేందుకు అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు హాజరుకానున్నట్లు నల్లా పవన్ కుమార్ వెల్లడించారు. మ్యాచ్ అనంతరం విజేతలకు బహుమతుల ప్రదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో విజేత జట్టుకు రూ.50 వేల నగదు బహుమతితో పాటు విన్నర్స్ ట్రోఫీ, రన్నర్స్ జట్టుకు రూ.25 వేల నగదు బహుమతితో పాటు రన్నర్స్ ట్రోఫీ అందజేయనున్నట్లు తెలిపారు. యువత క్రీడల వైపు మరింతగా ఆకర్షితులై తమ ప్రతిభను చాటుకోవాలనే లక్ష్యంతో భవిష్యత్తులో కూడా ఇటువంటి క్రీడా కార్యక్రమాలను నిర్వహించేందుకు నల్లా చారిటబుల్ ట్రస్ట్ కృషి చేస్తుందని నల్లా పవన్ కుమార్ తెలిపారు.

# పల్లె పండుగ 3.0 తో గ్రామీణాభివృద్ధి


***దేవరపల్లిలో మినీ గోకులం నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు...***




**కొత్తపేట సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 4**
పల్లె పండుగ 3.0 తో గ్రామీణాభివృద్ధి సాకారం అవుతుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు.శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో రూ.4,290 కోట్ల భారీ అంచనా వ్యయంతో గ్రామీణాభివృద్ధి కోసం చేపట్టిన కార్యక్రమమే పల్లె పండుగ 3.0 అని ఆయన తెలియజేశారు. ఇందులో భాగంగా శుక్రవారం దేవరపల్లి గ్రామంలో క్యాటిల్ షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కూటమి ప్రభుత్వం గ్రామీణ పేదల జీవనోపాధికి అండగా రూ.300 కోట్ల అంచనా వ్యయంతో రాష్ట్రవ్యాప్తంగా మినీ గోకులాల నిర్మాణానికి కృషి చేస్తుందన్నారు. పశువులకు సురక్షితమైన వసతి కల్పిస్తూ, పశు పోషకులు రైతులకు అండగా నిలుస్తున్న ఈ నిర్మాణాలు గ్రామీణ అభివృద్ధికి నిదర్శనమన్నారు.


## నడిపూడి లో శ్రీ విజయ కనకదుర్గని దర్శించుకున్న ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు

### అమ్మవారి ఆశీస్సులతో నియోజకవర్గం సుభిక్షంగా ఉండాలి: ఎమ్మెల్యే ఆనందరావు



**అమలాపురం సిటీ సిటిజన్ సెప్టెంబర్ 04**
అమలాపురం రూరల్ మండలం, నడిపూడి చెరువుగట్టు వద్ద గ్రామస్థులు అత్యంత భక్తిశ్రద్ధలతో నూతనంగా నిర్మించుకున్న శ్రీ విజయ కనకదుర్గ అమ్మవారి ఆలయాన్ని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని, గ్రామ ప్రజలందరికీ అమ్మవారి దివ్య ఆశీస్సులు లభించాలని, గ్రామం సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. స్వచ్ఛందంగా ఆలయాన్ని నిర్మించుకున్న నడిపూడి గ్రామస్థుల భక్తిప్రపత్తులను, ఐక్యతను ఎమ్మెల్యే కొనియాడారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కి సాదర స్వాగతం పలికి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, జనసేన నాయకులు మండేలా బాబీ, మార్కెట్ కమిటీ చైర్మన్ అధికారి జయవెంకటలక్ష్మి బాబ్జీ , స్థానిక కూటమి నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

# గాజుల అలంకారంలో శ్రీ సుబ్బాలమ్మ తల్లి



## ఉచితంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



**అమలాపురం సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 4**

శ్రావణమాసం పురస్కరించుకొని అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంలో గ్రామ దేవత సుబ్బాలమ్మ ఆలయం వద్ద శుక్రవారం నిర్వహించిన సామూహిక వరలక్ష్మి వ్రతానికి భక్తులు పోటెత్తారు. ఆలయ చైర్మన్ అప్పన వీరన్న, కార్యనిర్వాహణాధికారి శ్రీనివాస్,ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతం ఆశాంతం నేత్ర పర్వంగా కొనసాగింది. ఈ సందర్భంగా నిర్వాహకులు మీడియాతో మాట్లాడుతూ ప్రతి సంవత్సరం శ్రావణమాసంలో నాలుగవ శుక్రవారం సుబ్బాలమ్మ ఆలయం వద్ద అమ్మవారిని గాజులతో అలంకరించి సామూహిక వరలక్ష్మీ వ్రతాలను ఉచితంగా జరిపిస్తున్నామని పేర్కొన్నారు. వ్రతంలో పాల్గొనే భక్తులకు దేవస్థానం, ఆలయ అభివృద్ధి కమిటీ దాతల సహకారంతో సమకూర్చిన వెండి రూపులను అందిస్తున్నామని వెల్లడించారు.సుమారు 5 వందలమంది భక్తులు వ్రతాల్లో పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమం సజావుగా జరగడానికి సహకరించిన భక్తులకు ధన్యవాదాలు తెలిపారు.

## శ్రీ లక్ష్మీనరసింహ ఆలయంలో సామూహిక వరలక్ష్మి పూజలు



**రాజోలు సిటిజన్ టైమ్స్ గోదావరి జిల్లాల ఇంచార్జ్ నాగ శ్రీనివాస్ సెప్టెంబర్ 4**

సఖినేటిపల్లి మండలం , అంతర్వేది గ్రామములో వేంచేసియున్న నవనారసింహ క్షేత్రాలలో ప్రముఖమైన శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి దేవస్థానం నందు శ్రావణ మాసం నాల్గవ శుక్రవారం సందర్భముగా సాముహిక " వరలక్ష్మి కుంకుమ పూజలు " ఆలయ అర్చక స్వాముల ఆద్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమములో సుమారు 800 మంది ముత్తైదువులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సాముహిక వరలక్ష్మి కుంకుమ పూజల యందు పాల్గొన్న ముత్తైదువులకు ఎటువంటి పూజా రుసుము లేకుండా అమ్మవారి రూపు , పూజ సామాగ్రి పంపిణి చేయుట జరిగినది. తదనంతరం శ్రీ స్వామి వారి దర్శనం, ప్రసాద వితరణ చేసి ,నిత్యాన్నదాన విభాగము నందు భోజన వసతి ఏర్పాటు చేయుట జరిగింది..

## ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



**ఉమ్మడి చిత్తూరు జిల్లా స్పాట్ రిపోర్టర్ సెప్టెంబర్ 4(సిటిజన్ టైమ్స్)**

గుర్రంకొండ మండలం సరిమడుగు గ్రామం, పుల్లావాండ్లపల్లి నందు ఉన్న శ్రీ జగద్గురు ధ్యాన మందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఆధ్యాత్మిక గురువు తిరువీధి వేణుగోపాల్ స్వామి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఉదయం 06.00 గంటలకు ధ్వజారోహణంతో మొదలై శ్రీమద్భగవద్గీత పారాయణం, రాధాక్రిష్ణల వేషధారణ పిల్లలకు బహుమతులు, ఉట్టి కొట్టడం, ఆధ్యాత్మిక ప్రవచనాలు అన్నప్రసాద వితరణతో వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది.భక్తులు భక్తిశ్రద్ధలతో ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు. పిల్లల వేషాధారణ చూపరులను ఆకట్టుకొన్నాయి.

## గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో మెరుగైన రహదారి వ్యవస్థ

### రూ.1.50 కోట్ల సాస్కీ నిధులతో నిర్మించనున్న రెండు బీటీ రోడ్లకు భూమిపూజ చేసిన ఎమ్మెల్యే బండారు...



**ఆలమూరు సిటిజన్ టైమ్స్ గోదావరి జిల్లాల ఇంచార్జ్ నాగ శ్రీనివాస్ సెప్టెంబర్ 4**

ఆలమూరులో రూ.80లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు... గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో మెరుగైన రహదారి వ్యవస్థ అత్యంత కీలకమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుదలకు రహదారులు తోడ్పడతాయని తెలిపారు. శుక్రవారం ఆయన నియోజకవర్గంలోని దేవరపల్లి, ఆలమూరు గ్రామాల్లో రూ.1.50కోట్ల సాస్కీ నిధులతో చేపట్టిన రెండు బీటీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. తొలుత రూ.60లక్షలతో నిర్మించనున్న దేవరపల్లి శివారు మట్టలదొడ్డి రహదారికి భూమి పూజ నిర్వహించారు. అనంతరం రూ.90 లక్షలతో ఆలమూరు పల్లిపేట నుంచి సూర్యారావుపేట వరకు నిర్మించనున్న బీటీ రోడ్డుకు భూమి పూజ నిర్వహించారు. తదుపరి ఆలమూరులో రూ.80 లక్షల రూపాయలతో నిర్మించిన సీసీ రహదారులను ప్రారంభించారు.

## మత్తు ఇంజక్షన్ల గుట్టురట్టు



**జంగారెడ్డిగూడెం: (సిటిజన్ టైమ్స్): సెప్టెంబర్ 04**

ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం లో కాలం చెల్లిన మత్తు ఇంజక్షన్ల అక్రమ నిల్వ గుట్టు రట్టయింది. డాంగే నగర్ లో ఓ కార్పెంటర్ దుకాణంలోదాచిన 7,550 ట్రెమడల్ ఇంజక్షన్లను డ్రగ్స్ ఇన్స్పెక్టర్ స్వాధీనం చేసుకున్నారు. లక్ష్మీ శ్రీనివాస్ మెడికల్ ఏజెన్సీ నిర్వాహకుడు కిషోర్ వాటిని డంపింగ్ యార్డ్ లో ధ్వంసం చేసినట్లు అధికారులను తప్పుదోవ పట్టించి తనిఖీలకు చిక్కకుండా స్నేహితుడు దుకాణంలో దాచినట్లు అధికారులు తెలిపారు. భవాని మెడికల్స్ నిర్వాహకుడు మరో మూడు వేల ఇంజక్షన్లు విక్రయించినట్లు గుర్తించారు.

## గోదావరి జలాలు జిల్లాకు తరలింపు

### మొండెపులంకలో రూ.25 లక్షలతో 60 వేల లీటర్ల వాటర్ ట్యాంకుకు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ శంకుస్థాపన



**పి.గన్నవరం సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 4**

అంబేద్కర్ కోనసీమ జిల్లా, పి.గన్నవరం మండలం మొండెపులంక గ్రామంలో రూ.25 లక్షల వ్యయంతో నిర్మించనున్న 60 వేల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకు నిర్మాణ పనులకు పి.గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ కృషితో గోదావరి జలాలను కోనసీమ జిల్లాకు తరలించి, ప్రజలకు శాశ్వతంగా తాగునీటి సమస్యలు లేకుండా చేయాలనే లక్ష్యంతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. పి.గన్నవరం నియోజకవర్గంలో మొత్తం 17 వాటర్ ట్యాంకులు నిర్మించనున్నామని, ఇప్పటికే మూడు వాటర్ ట్యాంకులకు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించామని తెలిపారు. అందులో భాగంగా ఈ రోజు మొండెపులంక గ్రామంలో 60 వేల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకుకు శంకుస్థాపన చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉండేలా, భవిష్యత్తులో తాగునీటి ఇబ్బందులు లేకుండా చేయాలనే సంకల్పంతో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పనిచేస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆయనకు తోడుగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టితో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, జనసేన పార్టీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నాగర్ కర్నూల్ జిల్లాలో 70 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం



**సిటిజన్ టైమ్స్ నాగర్ కర్నూల్ సెప్టెంబర్ 4**

జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని నాగర్ కర్నూల్ జిల్లాలో 70 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించనున్నారు. విద్యారంగానికి విశిష్ట సేవలు అందిస్తున్న వారిని బోధనా ప్రతిభ, విద్యార్థుల అభివృద్ధికి చేసిన కృషి, ఉపాధ్యాయ వృత్తిలో ప్రతిభ, పాఠశాలల అభివృద్ధిలో సేవలను పరిగణనలోకి తీసుకుని ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. సెప్టెంబర్ 7న నాగర్ కర్నూల్ ఐడీఓసీ మీటింగ్ హాల్ లో మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా స్థాయి ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించి ఎంపికైన 70 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం చేయనున్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు అందిస్తున్న సేవలు అభినందనీయమని డీఈఓ రమేష్ కుమార్ తెలిపారు.



*మురళీ గానంలో బాలకృష్ణుడు మాయుఖ్.. ముద్దుల రాధగా చిన్నారి దేవాన్షి..! చిన్నారుల సంప్రదాయ వేషధారణ అందరినీ విశేషంగా ఆకట్టుకుంది.*

## కన్నుల పండుగగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



**సెప్టెంబర్4,, సిటిజన్ టైమ్స్, హుస్నాబాద్**

శ్రీకృష్ణాష్టమి సందర్భంగా సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో విశ్వహిందూ పరిషత్ ఉపాధ్యక్షులు గందె చంద్రమౌళి-అన్నపూర్ణ దంపతుల నివాస గృహంలో ప్రత్యేక అలంకరణల నడుమ కన్నుల మిరమిట్లు కొలిపే కోవెలలాగా ముస్తాబులు చేసి శ్రీకృష్ణుని అలంకరించి బంతిపూల మధ్య శ్రీ కృష్ణయ్య అడుగులు వేసి మహిళలు పారాయణాలు చేస్తూ భక్తిశ్రద్ధల నడుమ కృష్ణయ్యను పూజించారు. నల్లనయ్య గోపయ్య పిల్లనగ్రోవి ఏదయ్య గోపికలు వచ్చే వేళాయి రావయ్య కృష్ణయ్య అంటూ భక్తిశ్రద్ధల నడుమ కొలిచారు. గత 15 సంవత్సరాల నుండి భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవోపేతంగా పుష్పాల అలంకరణలనడుమ శ్రీకృష్ణాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా చూడముచ్చటగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని గందెచంద్రమౌళి తెలిపారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో అష్టైశ్వర్యాలతో ఉండాలని ఆ కృష్ణయ్యను ప్రార్థించినట్లు తెలిపారు. వసుదేవసుతం దేవం కంసచానూర మర్దనం దేవకీ పరమానందం కృష్ణం వందే జగద్గురుం. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య రాష్ట్ర నాయకులు రాగి కవిత, నార్ల విజయ, మాడిశెట్టి హేమలత,ఆర్యవైశ్య కులబాంధవ్యులు కాలనీవాసులు భక్తులు మహిళలు చిన్నారులు యువతీ యువకులు తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణాష్టమి సంబరాలతో కళకళలాడిన ప్రకాశం కళాశాల








**కందుకూరు, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 4**

శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల (స్వయంప్రతిపత్తి)లో నిర్వహించిన వేడుకలు ఆధ్యాత్మికత, సంప్రదాయం, విద్యార్థుల ఉత్సాహం కలగలిసి కనులపండువగా సాగాయి. కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో లెమన్ అండ్ స్పూన్ రేస్, మ్యూజికల్ చెయిర్స్, టగ్ ఆఫ్ వార్, ఉట్టి కార్యక్రమం, కోలాటం తదితర పోటీలు సందడిగా జరిగాయి. ముఖ్యంగా కొత్తగా కళాశాలలో చేరిన ఫ్రెషర్స్ ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. కోలాటం ప్రదర్శన ప్రేక్షకులను అలరించగా, ఉట్టి కార్యక్రమం విద్యార్థుల్లో ఉత్సాహాన్ని రెట్టింపు చేసింది. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ డా. కె. విజయ శ్రీనివాస్ విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది, తల్లిదండ్రులు, కళాశాల శ్రేయోభిలాషులందరికీ శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. "శ్రీకృష్ణుడు జ్ఞానం, ధైర్యం, నాయకత్వం, ధర్మం, సమయస్ఫూర్తికి ప్రతీక. ప్రతి విద్యార్థి ఆయన జీవితంలోని విలువలను ఆదర్శంగా తీసుకుని విద్యతో పాటు మంచి వ్యక్తిత్వాన్ని, నైతిక విలువలను అలవర్చుకోవాలి. పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు చేరవేసే గొప్ప వేదికలు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఐక్యత, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, జట్టుగా పనిచేసే నైపుణ్యాన్ని పెంపొందిస్తాయి. విద్యతో పాటు సంస్కారాలను అందించడమే ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల లక్ష్యం" అని అన్నారు. ప్రిన్సిపాల్ డా. సి.హెచ్. రవి కుమార్ మాట్లాడుతూ, "విద్యార్థుల సమగ్ర వికాసానికి ఇలాంటి సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయి. ప్రతి విద్యార్థి ఉత్సాహంగా పాల్గొనడం ఆనందదాయకం" అని పేర్కొన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమం ముగింపులో విద్యార్థులందరికీ స్వీట్లు పంపిణీ చేసి శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ ఇన్‌చార్జి మీరవలి, డా. కె. పవని, డా. ఎస్.కె. సురియా షిహాబ్, డా. జి. ప్రసాద్ తో పాటు ఎస్ హెచ్ విభాగ అధ్యాపకులు పాల్గొని కార్యక్రమాలను విజయవంతంగా సమన్వయం చేశారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా లక్ష్మీనారాయణ, నరసయ్య





**సి ఎస్ పురం, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 4**

మండలానికి చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక కావడం పట్ల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని వి.బైలు పాఠశాలలో పనిచేస్తున్న జి. లక్ష్మీనారాయణ, నల్లమడుగుల పాఠశాలలో పనిచేస్తున్న ఆర్.పి. నరసయ్యలు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారులు జె. ప్రసాదరావు, బూదాల డేవిడ్, యూటీఎఫ్ అధ్యక్షులు కె. నాగరాజు, ప్రధాన కార్యదర్శి కుండా వెంకటేశ్వర్లు, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ జె. వెంకట్రావు వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు, వారి విద్యాభివృద్ధికి అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయులను గుర్తించి సత్కరించడం ఎంతో ప్రోత్సాహకరమన్నారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన లక్ష్మీనారాయణ, నరసయ్యలు మరింత బాధ్యతతో పనిచేసి విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేయాలని ఆకాంక్షించారు.

## ఎన్ఎస్పి కాలవపై ఎడ్యుకేట్ ఇంజనీర్ ఆకస్మిక తనిఖీ

### పసుమర్రు మేజర్ పై చెరువులు తనిఖీ చేసిన ఎడ్యుకేట్ ఇంజనీర్ సతీష్ చంద్ర



**సంతమాగులూరు, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 4**

సంతమాగులూరు మండలం కొమ్మాలపాడు 26వ మైలురాయి వద్ద సతీశ్ చంద్ర శుక్రవారం పసుమర్రు మేజర్ పై పరిశీలన చేయడం జరిగింది. 26 వ మైలు 0%0 నుండి 16 కిలోమీటర్ల పరిశీలన తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎగ్జిక్యూట్ ఇంజనీర్ సతీష్ చంద్ర మాట్లాడుతూ ఉప్పుమాగులూరు, సజ్జాపురం, చెన్నుపల్లి, మక్కెనవారిపాలెం గ్రామాలకు సంబంధించిన మంచినీటి చెరువులను తనిఖీ చేయడం జరిగిందని ప్రస్తుతం వస్తున్న సాగర్ జలాలతో 90 శాతం అన్ని చెరువులలో నీరు నింపడం పూర్తి అవ్వడం జరిగిందని నీరు వృధాగా పోకుండా తగిన చర్యలు తీసుకున్నామని క్షేత్రస్థాయి నుంచి ఎవరు శ్రద్ధ వహించకుండా చెరువులకు మాత్రమే మంచినీటిని అందించగలగడమే ప్రధానో లక్ష్యం అని సతీష్ చంద్ర తెలిపారు.

# బోధనా సేవలకు జిల్లా స్థాయి కిరీటం

### -2026 జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా మద్దినేని సునీత ఎంపిక



**వలేటివారిపాలెం, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 4**

విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో అంకితభావంతో సేవలందిస్తున్న మద్దినేని సునీతకు ప్రతిష్ఠాత్మక గౌరవం దక్కింది. వలేటివారిపాలెం మండలం శింగమనేనిపల్లె ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆమెను 2026 సంవత్సరానికి ప్రకాశం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డుకు జిల్లా అధికారులు ఎంపిక చేసి ప్రకటించారు.

**2005లో ప్రారంభమైన ప్రస్థానం.. నేడు జిల్లా స్థాయి గుర్తింపు....**

మద్దినేని సునీత 2005 నవంబర్‌లో సీఎస్‌పురం మండలం ముండ్లపాడు ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా తొలి పోస్టింగ్ పొందారు. అనంతరం 2009లో కలవళ్ల ప్రాథమిక పాఠశాలలో, 2017లో నలదలపూరు ప్రాథమిక పాఠశాలలో సేవలందించారు. 2025 నుంచి శింగమనేనిపల్లె ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తూ విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారు. బోధనలో ప్రతిభ, విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ, పాఠశాల అభివృద్ధికి చేస్తున్న కృషికి గుర్తింపుగా ఆమెకు ఇప్పటికే పలు పురస్కారాలు లభించాయి. 2022 మార్చిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సబ్‌కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే చేతుల మీదుగా ఎంపవరింగ్ ఉమెన్స్ అవార్డు--2022 అందుకున్నారు. అదేవిధంగా 2025లో వలేటివారిపాలెం మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డు అందుకున్నారు. అదే ఏడాది అక్టోబర్‌లో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు. తాజాగా జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక కావడంతో ఆమె ఉపాధ్యాయ ప్రస్థానంలో మరో ప్రతిష్ఠాత్మక మైలురాయి నమోదైంది.

**అభినందనల వెల్లువ...**

మద్దినేని సునీత జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక కావడంపై ఆమెతో కలిసి పనిచేసిన సహచర ఉపాధ్యాయులు, వలేటివారిపాలెం మండలం ఎంఈఓ-1 మాల్యాద్రిరెడ్డి, ఎంఈఓ-2 మల్లికార్జున తదితరులు అభినందనలు తెలిపారు. తమ గ్రామంలోని పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలికి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డు రావడం తమకు ఎంతో ఆనందంగా, గర్వంగా ఉందని శింగమనేనిపల్లె గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. సునీత సాధించిన ఈ గుర్తింపు తోటి ఉపాధ్యాయులకు, విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని వారు పేర్కొన్నారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి...



**పుల్లల చెరువు, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 4**

పుల్లలచెరువు మండలం చెనంపల్లి గ్రామాన్ని ఎస్ఐ బి సాంబశివరావు సందర్శించి ప్రజలకు పలు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా రోడ్డు భద్రత, సైబర్ నేరాల నివారణ, మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలు, మహిళల భద్రత, పోక్సో చట్టం తదితర అంశాలపై ప్రజలకు వివరించారు.రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, లింక్‌లను నమ్మి వ్యక్తిగత వివరాలు, బ్యాంకు సమాచారం, ఓటీపీ వంటి వివరాలను ఎవరికీ వెల్లడించవద్దని సూచించారు.అలాగే యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటి వల్ల భవిష్యత్తు నాశనం కావడంతో పాటు కుటుంబాలు తీవ్రంగా నష్టపోతాయని హెచ్చరించారు. మహిళలు, బాలికల భద్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడితే పోక్సో చట్టం కింద కఠిన చర్యలు తప్పవని తెలిపారు.ప్రజలు ఎలాంటి సమస్య ఎదురైనా పోలీసులను సంప్రదించాలని, చట్టవిరుద్ధ కార్యకలాపాలపై సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని ఎస్ఐ కోరారు. కార్యక్రమంలో గ్రామస్థులు, యువత పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

### ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన దక్షిత, లాస్యశ్రీ వేషధారణ



**సి ఎస్ పురం, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 4**

మండలంలోని పలు గ్రామాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని సి ఎస్ పురం గ్రామానికి చెందిన దర్శి చిన్న కాశయ్య మనవరాళ్లు దక్షిత, లాస్యశ్రీలు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో ముస్తాబై అందరి దృష్టిని ఆకర్షించారు. సంప్రదాయ దుస్తులు, ఆభరణాలు, ఆకట్టుకునే అలంకరణతో చిన్నారులు ముద్దుగా కనిపించడంతో కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు కూడా ఎంతో ఆనందం వ్యక్తం చేశారు.జన్మాష్టమి సందర్భంగా చిన్నారులను శ్రీకృష్ణుడు, రాధ, గోపికలుగా అలంకరించడం ప్రత్యేక వేషధారణల ద్వారా శ్రీకృష్ణుడి బాల్య లీలలు, గోకుల వాతావరణాన్ని గుర్తుచేసుకోవడంతో పాటు, చిన్నతనం నుంచే పిల్లలకు మన సంస్కృతి, సంప్రదాయాలపై దక్షిత, లాస్యశ్రీలు రాధాకృష్ణుల వేషధారణలో కనిపించడంతో వారిని చూసేందుకు కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు ఆసక్తి చూపారు. చిన్నారుల ముద్దుముద్దు మాటలు, చిరునవ్వులు అందర్నీ ఆకట్టుకున్నాయి చిన్ని కృష్ణయ్య బుజ్జి గోపికమ్మ చూడ ముచ్చటమ్మా అంటూ సంతోషం వ్యక్తం చేస్తూ అభినందిస్తూ ఆశీర్వదించారు ఇలాంటి కార్యక్రమాల ద్వారా మన సంస్కృతి సంప్రదాయాలపై అవగాహన కలుగుతుందని పలువురు గ్రామస్తులు అభిప్రాయపడ్డారు.

# కరువు సహాయక చర్యలు చేపట్టి రైతులను ఆదుకోవాలి -ఏపీ రైతు సంఘం డిమాండ్



**మార్కాపురం, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 4**

ఎల్-నినో ప్రభావంతో వర్షాలు లేక కరువు ఏర్పడి రైతులు, కూలీలు తీవ్రంగా నష్టపోతున్నారని, వెంటనే కరువు సహాయక చర్యలు చేపట్టి ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు.రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం గాలి వెంకటరామిరెడ్డి అధ్యక్షతన శుక్రవారం ప్రజా సంఘాల జిల్లా కార్యాలయంలో జరిగింది.ఈ సందర్భంగా కె. ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ రైతులు వేసిన అన్ని రకాల పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయారని, ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం వెంటనే ఆదుకోకుంటే రైతులు కోలుకునే పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వం తక్షణమే పంట నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.రైతులు పంటలపై తీసుకున్న రెండు లక్షల రూపాయల వరకు రుణాలను రద్దు చేయాలని, పశువులకు పశుగ్రాసం అందించాలని కోరారు. రైతులు ఉచిత బీమా పథకం అమలు చేయాలని అడుగుతుంటే, పంటలు వేయకుండానే ఇన్సూరెన్స్ కట్టమని ప్రభుత్వం ప్రోత్సహించడం కంపెనీల ప్రయోజనం కోసమే తప్ప రైతుల ప్రయోజనం కోసం కాదని ఆరోపించారు. భవిష్యత్తులో రైతులకు ఇన్సూరెన్స్ రాకపోతే అధికారులు, ప్రజాప్రతినిధులే బాధ్యత వహించాలని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి. తిరుపతిరెడ్డి, ఊసా వెంకటేశ్వర్లు, నాయకులు వై. పాపిరెడ్డి, రామకృష్ణ, వెంకటేశ్వరరెడ్డి, నాగయ్య, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## నలమల్ల అడవి వేట

### ఉడుమును వేటాడిన ముగ్గురు అరెస్ట్.

### న్యాయమూర్తి ముందు హాజరు కోర్టు రిమాండ్



**గిద్దలూరు, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 4**

గిద్దలూరు డివిజన్ గుండ్లకమ్మ అటవీ రేంజ్ పరిధిలోని దిగువమెట్ట సెక్షన్‌లో ఉడుములను వేటాడిన కేసులో ముగ్గురు వ్యక్తులను అటవీ అధికారులు అరెస్ట్ చేశారు. దిగువమెట్ట గ్రామానికి చెందిన బండి నాగేంద్ర, బండి ప్రశాంత్, గిద్దలూరుకు చెందిన గరికపాటి అనిల్‌ను అదుపులోకి తీసుకుని గిద్దలూరు మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. నిందితులకు మేజిస్ట్రేట్ 15 రోజుల రిమాండ్ విధించడంతో వారిని మార్కాపురం సబ్‌జైలుకు తరలించారు. ఉడుములు వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం షెడ్యూల్-1లో అత్యంత రక్షణ కల్పించిన వన్యప్రాణుల జాబితాలో ఉన్నాయని తెలిపారు. ఉడుములను వేటాడటం, చంపడం తీవ్రమైన నేరంగా పరిగణించబడుతుందని పేర్కొన్నారు. ఉడుములు అటవీ ప్రాంతాలతో పాటు వ్యవసాయ పొలాలు, నివాస ప్రాంతాల్లోనూ సంచరించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ప్రజలు వాటిని చూసి భయాందోళనలకు గురికాకుండా, వాటికి ఎలాంటి హాని చేయకుండా వెంటనే స్థానిక అటవీ అధికారులకు సమాచారం అందించాలని గుండ్లకమ్మ రేంజ్ అటవీ క్షేత్రాధికారి కోరారు.

# కూటమి ప్రభుత్వం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

### వెలుగొండ నిర్వాసితులను పరామర్శించిన ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్




**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 4**

వెలుగొండ ప్రాజెక్టు ముంపు గ్రామాల నిర్వాసితుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, లేకుంటే నిర్వాసితులకు అండగా పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని యర్రగొండపాలెం ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ హెచ్చరించారు.పెద్దారవీడు మండలం తోకపల్లి గ్రామంలో నివసిస్తున్న వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసితులను ఆయన శుక్రవారం పరామర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, విద్యుత్ తదితర సమస్యలపై వెంటనే అధికారులతో ఫోన్‌లో మాట్లాడి అత్యవసరంగా పరిష్కరించాలని ఆదేశించారు. నిర్వాసితులకు సంబంధించిన పట్టాల పంపిణీ విషయంలో ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. పునరావాస ప్రాంతాల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించకుండా నిర్వాసితులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. గత నాలుగు రోజులుగా పెద్దారవీడు మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నిర్వాసితులకు భోజన సదుపాయం, మంచినీటి సరఫరా, ట్యాంకర్ల ద్వారా నీటి పంపిణీ, కూరగాయల పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిర్వాసితులకు ఎలాంటి సమస్య వచ్చినా యర్రగొండపాలెం ఎమ్మెల్యే కార్యాలయాన్ని సంప్రదించాలని, తమ వంతుగా అన్ని విధాలా అండగా ఉంటామని తాటిపర్తి చంద్రశేఖర్ భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# 'ఎపిక్' సబ్కో సాంగ్.. విదేశాల్లో స్టూడెంట్ లైఫ్ ఇలా..







'ఎపిక్ ఫస్ట్ సెమిస్టర్' నుంచి నాలుగో పాటగా 'సబ్కో' రిలీజ్ అయ్యింది. ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న ఈ సినిమాకు ఆదిత్య హాసన్ దర్శకత్వం వహించారు. ఇప్పటివరకు వచ్చిన పాటల్లో ప్రేమకు ఎక్కువ చోటు కనిపిస్తే, ఈసారి ఫ్రెండ్స్ గ్యాంగ్ వైపు వెళ్లారు. చదువు కోసం విదేశాలకు వెళ్లిన స్టూడెంట్స్ అక్కడ ఎలా ఉంటారు, వాళ్ల రోజువారీ లైఫ్ ఎలా మారుతుంది అనే విషయాలను పాటలో చూపించారు. లండన్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ పాట సాగుతుంది. లండన్ ఐ, డబుల్ డెక్కర్ బస్సులు, అక్కడి వీధులు, బీచ్ లొకేషన్స్ హైలెట్ అయ్యాయి. కానీ కేవలం లొకేషన్స్ చూపించడంతో ఆగలేదు. పార్ట్ టైమ్ జాబ్స్ చేయడం, సూపర్ మార్కెట్‌లో సరుకులు కొనడం, రూమ్‌లో వంట చేసుకోవడం, అసైన్‌మెంట్స్‌తో కూర్చోవడం లాంటి స్టూడెంట్ లైఫ్ మూమెంట్స్ కూడా పెట్టారు. విదేశాల్లో చదివిన వాళ్లకు తెలిసిన చిన్న చిన్న విషయాలనే పాటలో ఎక్కువగా వాడారు.శ్రీ హర్ష ఇమాని రాసిన లిరిక్స్ కూడా అదే లైన్‌లో సాగుతాయి. "దేశం కాని దేశంలో" అంటూ ఇంటికి దూరంగా ఉన్న యువత పరిస్థితిని చెబుతూనే, కొత్త ఫ్రెండ్స్‌తో ఏర్పడే బంధాన్ని తీసుకొచ్చారు. అక్కడ ఎదురయ్యే కష్టాలను మాత్రమే కాకుండా, వాటి మధ్యలో వచ్చే సరదాను కూడా పాటలో కలిపారు. హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందించగా సంజిత్ హెగ్డే, సితార కృష్ణకుమార్ ఈ పాటను పాడారు. ఆనంద్, వైష్ణవి మధ్య ట్రాక్ కూడా పాటలో పూర్తిగా పక్కన పెట్టలేదు. ఫ్రెండ్స్‌తో కలిసి పబ్‌కు వెళ్లడం, బయట తిరగడం, ఒకరితో ఒకరు టైమ్ గడపడం కనిపిస్తుంది. బోర్డ్ గేమ్ ఆడే సీన్, చిన్న రొమాంటిక్ మూమెంట్స్ కూడా ఉన్నాయి. అంటే ఇది పూర్తిగా ఫ్రెండ్‌షిప్ సాంగ్ కాకుండా, వాళ్లిద్దరి రిలేషన్ కూడా అదే గ్రూప్ లైఫ్ మధ్యలో ఎలా పెరుగుతుందో చూపించేలా పెట్టారు.

'బేబీ' తర్వాత ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య మళ్లీ కలిసి నటిస్తున్న సినిమా ఇదే. కానీ ఈసారి వాళ్ల మధ్య కథ పూర్తిగా వేరే సెటప్‌లో ఉంది. ఆదిత్య హాసన్ '90ం ఏ మిడిల్ క్లాస్ బయోపిక్' తర్వాత చేస్తున్న ఫీచర్ ఫిల్మ్ కావడంతో, మిడిల్ క్లాస్ యువత విదేశాలకు వెళ్లాక వచ్చే మరో జీవితాన్ని ఈ కథలో తీసుకున్నాడు. 'సబ్కో' పాటలో ఆ భాగం ఎక్కువగా బయటపడింది.

'ఎపిక్ ఫస్ట్ సెమిస్టర్' సెప్టెంబర్ 11న థియేటర్లలోకి రానుంది. రిలీజ్‌కు పది రోజుల ముందు ఈ పాటను తీసుకొచ్చారు. ప్రస్తుతం చిత్ర బృందం ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని కాలేజీల్లో ప్రమోషన్స్ చేస్తోంది. 'సబ్కో'ను కూడా స్టూడెంట్స్ మధ్య విడుదల చేశారు. ఇక సినిమా కంటెంట్ లేటెస్ట్ జనరేషన్ కు ఎంతవరకు కనెక్ట్ అవుతుందో చూడాలి.

# అభిషేక్ శర్మ కాదు.. వైభవ్ సూర్యవంశీకి సరైన ఓపెనింగ్ జోడి అతడే!



ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్ తరఫున బరిలోకి దిగి భారత జాతీయ జట్టులోకి దూసుకొచ్చిన 15 ఏళ్ల కుర్రాడు వైభవ్ సూర్యవంశీ ప్రస్తుతం అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నాడు. జూన్‌లో ఇంగ్లాండ్‌పై అంతర్జాతీయ అరంగేట్రం చేసినప్పటికీ, ఆ తర్వాత జరిగిన జింబాబ్వే పర్యటనలో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డుతో తన ప్రతిభను ప్రపంచానికి చాటిచెప్పాడు. ఇప్పటివరకు తాను ఆడిన 6 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లోనూ అభిషేక్ శర్మతో కలిసే ఓపెనింగ్ చేశాడు. కానీ, సెప్టెంబర్ 13వ తేదీన ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో ఆఫ్ఘనిస్థాన్‌తో జరగబోయే మ్యాచ్ ద్వారా వైభవ్ భారత్‌లో తన మొదటి మ్యాచ్ ఆడబోతున్న వేళ, ఓపెనింగ్ జోడీలో మార్పులు చేయాలని మాజీ వికెట్ కీపర్ దీప్ దాస్‌గుప్తా టీమిండియా మేనేజ్‌మెంట్‌కు కీలక సూచన చేశాడు.

**సంజూ శాంసన్ - వైభవ్ కాంబినేషన్ అదుర్స్:**

భారత టీ20 జట్టులో ప్రస్తుతం అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, సంజు శాంసన్‌లతో పాటు ఇషాన్ కిషన్ రూపంలో నలుగురు ఓపెనింగ్ ఆప్షన్లు అందుబాటులో ఉన్నాయి. తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడిన దాస్‌గుప్తా, ఇప్పటివరకు అభిషేక్ - వైభవ్, అభిషేక్ - సంజు కాంబినేషన్లను మాత్రమే చూశాం, ఇంకా సంజు - వైభవ్ జోడీని పరీక్షించలేదని పేర్కొన్నాడు. ఆఫ్ఘనిస్థాన్‌తో సిరీస్‌లో సంజు శాంసన్‌ను వైభవ్‌తో కలిసి ఇన్నింగ్స్ ప్రారంభించేలా చేస్తే ఈ కాంబినేషన్ ఎంతవరకు వర్కవుట్ అవుతుందో క్లారిటీ వస్తుందని అభిప్రాయపడ్డాడు.

**అభిషేక్‌ను పక్కన పెట్టడం కాదు:**

ఈ సరికొత్త కాంబినేషన్ సూచనపై వివరణ ఇస్తూ, అభిషేక్ శర్మను జట్టు నుంచి తొలగించాలని తాను అనడం లేదని దాస్‌గుప్తా స్పష్టం చేశాడు.ద

రాబోయే టీ20 ప్రపంచకప్‌కు ముందు అందుబాటులో ఉన్న ప్రతి ఆటగాడికి, అన్ని కాంబినేషన్లకు తగినంత అవకాశం ఇవ్వడమే ప్రధాన లక్ష్యం.. మెగా టోర్నీకి ముందు జట్టుకు ఏ జోడీ బాగా సెట్ అవుతుందో అర్థం చేసుకోవడానికి, ఆటగాళ్లకు తగినంత మ్యాచ్ టైమ్ ఇవ్వడానికి ఇలాంటి ప్రయోగాలు ఎంతగానో ఉపయోగపడతాయని వెల్లడించాడు.

**రైట్ - లెఫ్ట్ కాంబినేషన్ అడ్వాంటేజ్:**

మరోవైపు అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్ ముగ్గురూ లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్లు కావడం గమనార్హం. కుడిచేతి వాటం బ్యాటర్ అయిన సంజు శాంసన్‌ను ఓపెనర్‌గా పంపడంతో జట్టుకు రైట్ - లెఫ్ట్ ఓపెనింగ్ కాంబినేషన్ అడ్వాంటేజ్ కూడా దక్కుతుందని క్రికెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ మేనేజ్‌మెంట్ జింబాబ్వే సిరీస్ హీరో వైభవ్ పక్కన సంజు శాంసన్‌ను దించుతుందా లేక పాత ఓపెనింగ్ జోడీకే ప్రాధాన్యత ఇస్తుందా అనేది ఇప్పుడు తీవ్ర ఆసక్తికరంగా మారింది.

# నేడు భారత్--పాక్ మహిళల క్రికెట్ సమరం.. ఎప్పుడు, ఎక్కడ చూడాలంటే?



మహిళల ఆసియా కప్ 2026లో భారత్--పాకిస్థాన్ జట్ల మధ్య ఆసక్తికర పోరుకు రంగం సిద్ధమైంది. సెప్టెంబర్ 5న దుబాయ్ వేదికగా ఈ హైవోల్టేజ్ మ్యాచ్ జరగనుంది. ఇప్పటికే సెమీఫైనల్ బెర్త్ ఖరారు చేసుకున్న భారత జట్టు.. గ్రూప్ దశను మరో విజయంతో ముగించాలని పట్టుదలగా ఉంది.

**హాంకాంగ్‌పై భారీ విజయం**

భారత్ తన గత మ్యాచ్‌లో హాంకాంగ్‌ను 137 పరుగుల తేడాతో చిత్తు చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియా 20 ఓవర్లలో 193 పరుగులు చేసింది. స్మృతి మంధాన 124 పరుగులతో అద్భుత ఇన్నింగ్స్ ఆడగా.. అనంతరం భారత బౌలర్లు హాంకాంగ్ బ్యాటింగ్‌ను కేవలం 56 పరుగులకే కట్టడి చేశారు. దీప్తి శర్మ మూడు వికెట్లు తీసుకోగా, శ్రీ చరణి, నందిని శర్మ, ప్రీతికా రావల్ రెండేసి వికెట్లతో రాణించారు.

**భారత్-పాక్ మ్యాచ్ వివరాలు**

తేదీ: సెప్టెంబర్ 5, శనివారం
వేదిక: దుబాయ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం
మ్యాచ్ ప్రారంభం: రాత్రి 8:00 గంటలకు (భారత కాలమానం)
టాస్: రాత్రి 7:30 గంటలకు
టీవీలో: సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్
ఆన్‌లైన్‌లో: సోనీ లివ్

మహిళల ఆసియా కప్ మ్యాచ్‌లు భారత కాలమానం ప్రకారం రాత్రి 8 గంటలకు ప్రారంభమవుతున్నాయి. భారత్--పాకిస్థాన్ పోరును కూడా సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్, సోనీ లివ్‌లో ప్రత్యక్షంగా వీక్షించవచ్చు.

**సెమీఫైనల్‌కు ముందు కీలక మ్యాచ్**

భారత్ ఇప్పటికే నాకౌట్ దశకు చేరుకోవడంతో ఈ మ్యాచ్ ఫలితం కంటే సెమీఫైనల్‌కు ముందు జట్టు కూర్పు, ఆటగాళ్ల ఫామ్‌పై దృష్టి పెట్టే అవకాశం ఉంది. స్మృతి మంధాన, షెఫాలీ వర్మ వంటి బ్యాటర్లు మంచి టచ్‌లో ఉండటం టీమిండియాకు సానుకూల అంశంగా మారింది. మరోవైపు పాకిస్థాన్ కూడా భారత్‌కు గట్టి పోటీ ఇవ్వాలని భావిస్తోంది. దీంతో శనివారం రాత్రి జరిగే దాయాదుల పోరుపై క్రికెట్ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

# దులీప్ ట్రోఫీ ఫైనల్‌కు సిరాజ్, పడిక్కల్.. సౌత్ జోన్ జట్టులో చోటు!



దులీప్ ట్రోఫీ ఫైనల్ పోరుకు భారత స్టార్ క్రికెటర్లు మహ్మద్ సిరాజ్, దేవదత్ పడిక్కల్ సిద్ధమయ్యారు. సెప్టెంబర్ 6 నుంచి ఈస్ట్ జోన్‌తో జరగనున్న ఫైనల్ కోసం సౌత్ జోన్ జట్టులో వీరిద్దరికీ చోటు దక్కింది. ఇటీవల శ్రీలంకతో జరిగిన రెండు టెస్టుల సిరీస్‌లోనూ ఇద్దరూ భారత్ తరఫున ఆడారు. ఈ సిరీస్‌ను భారత్ 1-0తో గెలుచుకుంది.శ్రీలంక సిరీస్‌లో పడిక్కల్ అద్భుతంగా రాణించాడు. మూడు ఇన్నింగ్స్‌ల్లో 328 పరుగులు చేసి ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌గా నిలిచాడు. ఇందులో రెండు సెంచరీలు ఉన్నాయి. మరోవైపు సిరాజ్ రెండు టెస్టుల్లో నాలుగు వికెట్లు పడగొట్టాడు. అయితే దులీప్ ట్రోఫీ ఫైనల్ కోసం వీరిద్దరూ సౌత్ జోన్ జట్టులో ఎవరిని భర్తీ చేస్తారన్నది ఇంకా స్పష్టంగా తెలియలేదు.టీ20 జట్టులో రెగ్యులర్‌గా ఉంటున్న వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్, తిలక్ వర్మ కూడా ఫైనల్‌లో ఆడే అవకాశం ఉందని సమాచారం. సెప్టెంబర్ 10న దులీప్ ట్రోఫీ ఫైనల్ ముగియనుండగా.. సెప్టెంబర్ 13 నుంచి ఆఫ్ఘనిస్థాన్‌తో టీ20 సిరీస్ ప్రారంభం కానుంది. అయినా ఫైనల్‌లో ఆడేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు తిలక్ ఇప్పటికే చెప్పాడు. నార్త్ జోన్‌తో సెమీఫైనల్లో తిలక్ తొలి ఇన్నింగ్స్‌లో 116 పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో 51 పరుగులతో ఆకట్టుకున్నాడు. సౌత్ జోన్ సెమీఫైనల్లో నార్త్‌ను 181 పరుగుల ఛేదనలో ఓడించింది. మరోవైపు ఈస్ట్ జోన్ 159 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి డిఫెండింగ్ ఛాంపియన్ సెంట్రల్ జోన్‌ను ఫైనల్ రేసు నుంచి తప్పించింది. ఇషాన్, సూర్యవంశీ ఆడకపోతే ఈస్ట్ జోన్ కొత్త కెప్టెన్‌ను ఎంపిక చేయాల్సి ఉంటుంది. బెంగాల్‌కు చాలాకాలంగా కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న అభిమన్యు ఈశ్వరన్‌కు ఆ బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది.

Printed, published,and owned by kancherla Sandeep kumar. Published at Door. No. 19-57, Deendayalpuram, mudasarlova, Visakhapatanam, Andrapradesh 530040.
Printed at Sri Sai Ganga printer's and publications flat no. 504,Bharat towers, 5th lane, Dwarakanagar, Visakhapatanam,Andrapradesh 530016.
Editor. Kancherla Sandeep Kumar. RNI No. APTEL /2009/28868.PHONE No. 9966447776